

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 05-12-2025 | సంపుటి - 26 | సంచిక -198 | రూ : 4 | పేజీలు: 8




2లో

## శ్రీవారి భక్తులకు అలర్ట్..

వైకుంఠ ద్వార దర్శనాలపై టీటీడీ కీలక ప్రకటన

### ఏడాది తిరిగేలోపు

## విమానాశ్రయ నిర్మాణ పనులు ప్రారంభం

2లో



- ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు చేయాలన్న రేవంత్ రెడ్డి
- కేంద్రం, విపక్షాలను కలుపుకుని ముందుకు సాగుతామని వెల్లడి

## నా మిత్రుడు పుతిన్‌కు స్వాగతం పలకడం ఎంతో ఆనందంగా ఉంది

: ప్రధాని మోదీ

2లో



## ప్రపంచాన్ని వణికిస్తున్న మలేరియా..

### 2024లో 6.10 లక్షల మంది మృతి




2లో

- 2024లో ప్రపంచవ్యాప్తంగా 28.2 కోట్ల మలేరియా కేసులు
- మలేరియా కారణంగా 6.10 లక్షల మంది మృతి.. వీరిలో అత్యధికులు చిన్నారులే
- మందులకు లొంగని మలేరియా.. పెరుగుతున్న డ్రగ్ రెసిస్టెన్స్ పెనుసవాల్

### ఛత్తీస్‌గఢ్‌లో

## భారీ ఎన్‌కౌంటర్..

18 మంది మావోయిస్టుల మృతదేహాలు స్వాధీనం

- ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య భీకర కాల్పులు

2లో



### ఆ ఒప్పందాలన్నీ 45 రోజుల్లో

## కార్యరూపం దాల్చాలి

2లో



సీఎం చంద్రబాబు ఆదేశం

- రాష్ట్రానికి రూ.20,444 కోట్ల విలువైన పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం
- రాష్ట్రంలో 56,278 మందికి కొత్తగా ఉద్యోగావకాశాలు
- 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' వల్లే ఏపీకి పరిశ్రమలు వస్తున్నాయన్న చంద్రబాబు

### పరిశీలన తర్వాతే

## అనుమతులు..



2లో

- ఎస్ఐపీబీ సమావేశంలో 31 కంపెనీలకు గ్రీన్ సిగ్నల్
- ప్రతి కంపెనీని పూర్తిస్థాయిలో పరిశీలించాకే అనుమతివ్వాలన్న మంత్రి లోకేశ్
- స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను సమర్థంగా అమలు చేయాలని సూచన

# ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్...

## 18 మంది మావోయిస్టుల మృతదేహాలు స్వాధీనం

ఛత్తీస్‌గఢ్, డిసెంబర్ 04 : ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. బీజాపూర్ జిల్లాలో భద్రతా బలగాలతో బుధవారం జరిగిన భీకర ఎన్‌కౌంటర్‌లో 18 మంది మావోయిస్టులు మరణించారు. ఈ భీకర కాల్పుల్లో ముగ్గురు భద్రతా సిబ్బంది కూడా వీరమరణం పొందారు. ఈ ఏడాది బస్తర్ ప్రాంతంలో మావోయిస్టులకు ఇదే అతిపెద్ద నష్టమని అధికారులు భావిస్తున్నారు. గంగలూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కేశ్‌కుతుల్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారన్న పక్కా సమాచారంతో ఈ ఆపరేషన్ చేపట్టారు. డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్), సీఆర్పీఎఫ్ కోబ్రా కమాండోలు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహిస్తుండగా మావోయిస్టులు కాల్పులకు తెగబడ్డారు. దీంతో భద్రతా దళాలు దీటుగా స్పందించాయి. చాలా గంటల పాటు సాగిన ఈ పోరులో తొలుత 12 మంది మావోయిస్టులు మృతి చెందినట్టు ప్రకటించారు. గురువారం ఉదయం ఘటనా స్థలంలో జరిపిన గాలింపు చర్యల్లో మరో ఆరు మృతదేహాలు లభించడంతో మృతుల సంఖ్య 18కి చేరింది. ఈ పోరాటంలో డీఆర్‌జీకి చెందిన హెడ్ కానిస్టేబుల్ మోను మోహన్ బడ్డి, కానిస్టేబుల్ దుకారు గోండే, జవాన్ రమేశ్ సోడీ కూడా మరణించారు. వారి మృతదేహాలను బీజాపూర్ హెడ్ క్వార్టర్స్‌కు తరలించి, ఉన్నతాధికారులు, తోటి జవాన్లు ఘనంగా నివాళులర్పించారు. ఘటనా స్థలం నుంచి భారీ ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్టు బీజాపూర్ ఎస్పీ జితేంద్ర సింగ్ మీనా తెలిపారు. మృతుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని, సమీప అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని ఆయన వెల్లడించారు.

# అమెరికా నుంచి 18,822 మంది భారతీయుల బహిష్కరణ

ఢిల్లీ, డిసెంబర్ 04 : 2009 నుంచి ఇప్పటివరకు 18,822 మంది భారత పౌరులను అమెరికా తమ దేశం నుంచి బహిష్కరించిందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. వీరిలో ఈ ఏడాది (2025) జనవరి నుంచి ఇప్పటివరకు 3,258 మందిని వెనక్కి పంపినట్లు తెలిపింది. ఇవాళ రాజ్యసభలో అడిగిన ఓ ప్రశ్నకు విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. మంత్రి అందించిన వివరాల ప్రకారం.. 2023లో 617 మంది, 2024లో 1,368 మంది భారతీయులను అమెరికా బహిష్కరించింది. ఈ ఏడాది వెనక్కి వచ్చిన 3,258 మందిలో 2,032 మంది (సుమారు 62.3 శాతం) సాధారణ కమర్షియల్ విమానాల్లో రాగా, మిగిలిన 1,226 మందిని (37.6 శాతం) యూఎస్ ఇమ్మిగ్రేషన్ అధికారుల ప్రత్యేక చార్టర్ విమానాల్లో భారత్‌కు పంపించారు. ఈ బహిష్కరణల వెనుక మానవ అక్రమ రవాణా (హ్యూమన్ ట్రాఫికింగ్) కీలక కారణంగా ఉందని జైశంకర్ సభకు వివరించారు. దీనిపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)తో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా విచారణ జరుపుతున్నాయని, పంజాబ్‌లో ఈ తరహా కేసులు అత్యధికంగా నమోదయ్యాయని తెలిపారు. ఎన్ఐఏ ఇప్పటివరకు 27 మానవ అక్రమ రవాణా కేసులు నమోదు చేసి, 169 మందిని అరెస్ట్ చేసిందని మంత్రి పేర్కొన్నారు. 132 మందిపై ఛార్జ్‌షీట్లు దాఖలు చేసినట్లు చెప్పారు. ఈ ఏడాది ఆగస్టు 7న హర్యానా, పంజాబ్‌లో ఇద్దరు కీలక ట్రాఫికర్లను, అక్టోబర్ 2న హిమాచల్ ప్రదేశ్‌లో మరో ఇద్దరిని ఎన్ఐఏ అరెస్ట్ చేసిందని జైశంకర్ వివరించారు.

# ప్రపంచాన్ని వణికిస్తున్న మలేరియా...

## 2024లో 6.10 లక్షల మంది మృతి

ఢిల్లీ, డిసెంబర్ 04 : ప్రపంచవ్యాప్తంగా మలేరియా మహమ్మారి మళ్లీ పంజా విసురుతోంది. 2024లో దాదాపు 28.2 కోట్ల మంది మలేరియా బారిన పడగా, 6.10 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారని ప్రపంచ ఆరోగ్య సంస్థ (WHO) తన వార్షిక నివేదికలో వెల్లడించింది. ఈరోజు విడుదల చేసిన ఈ నివేదిక, మలేరియా నిర్మూలన ప్రయత్నాలకు డ్రగ్ రెసిస్టెన్స్ (మందులకు లొంగని తత్వం) పెద్ద ముప్పుగా పరిణమించిందని హెచ్చరించింది. గతేడాదితో పోలిస్తే కేసుల సంఖ్య 90 లక్షలు పెరిగింది. మరణాలలో 95 శాతం ఆఫ్రికా దేశాల్లోనే సంభవించగా, వీరిలో ఐదేళ్ల లోపు చిన్నారులే అధికంగా ఉండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇక, ఆగ్నేయాసియా రీజియన్‌లో నమోదైన మొత్తం కేసులలో 73.3 శాతం మరణాలలో 88.7 శాతం భారత్‌లోనే ఉన్నాయని నివేదిక స్పష్టం చేసింది. ఇది దేశంలో వ్యాధి తీవ్రతకు అద్దం పడుతోంది. మలేరియాపై పోరాటంలో కొన్ని సానుకూల అంశాలు ఉన్నప్పటికీ, సవాళ్లు తీవ్రంగా ఉన్నాయి. ఒకవైపు వ్యాక్సిన్‌ల వాడకం ద్వారా 2024లో 17 కోట్ల కేసులను, 10 లక్షల మరణాలను నివారించగలిగారు. మరోవైపు, ఆఫ్రికాలోని 8 దేశాల్లో మలేరియా మందులు పనిచేయకపోవడం, 48 దేశాల్లో దోమలు కీటకనాశకాలను తట్టుకోవడం వంటివి సమస్యను జఠిలం చేస్తున్నాయి. వాతావరణ మార్పులు, నిధుల కొరత కూడా నిర్మూలన కార్యక్రమాలను దెబ్బతీస్తున్నాయి. "మలేరియా నివారణకు కొత్త సాధనాలు మనకు ఆశ కల్పిస్తున్నాయి. కానీ, పెరుగుతున్న కేసులు, డ్రగ్ రెసిస్టెన్స్, నిధుల కోత వంటి సవాళ్లు మనం సాధించిన పురోగతిని వెనక్కి నెట్టే ప్రమాదం ఉంది. అయినా పటిష్ఠమైన నాయకత్వం, సరైన పెట్టుబడులతో మలేరియా రహిత ప్రపంచాన్ని సాధించడం సాధ్యమే" అని డబ్ల్యూహెచ్‌ఓ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టెడ్రోస్ అధనామ్ ఘెబ్రేయేసస్ తెలిపారు.

# ఏడాది తిరిగేలోపు

## విమానాశ్రయ నిర్మాణ పనులు ప్రారంభం

ఆదిలాబాద్, డిసెంబర్ 04 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో మాట్లాడిన తర్వాత అదిలాబాద్ వేదికగా ప్రకటన చేస్తున్నానని, సంవత్సరం తిరిగేలోగా ఆదిలాబాద్‌లో విమానాశ్రయ పనులను ప్రారంభిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆదిలాబాద్ జిల్లాలో రూ.260 కోట్లతో అభివద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ, తాను రెండేళ్లలో ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదని అన్నారు. విపక్ష నేతలను కలుపుకుని తాము ముందుకు పోతున్నామని ఆయన అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు చేయాలని, ఆ తర్వాత ప్రభుత్వ ఫలాలు ప్రజలకు అందించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి విపక్ష ఎమ్మెల్యేలకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని విమర్శించారు. కానీ ఇప్పుడు తాము ప్రతిపక్షాలతో కలిసి ముందుకు సాగుతున్నామని అన్నారు. తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు రావాలని ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించానని, దేశంలోని ముఖ్యమంత్రులను కూడా ఆహ్వానిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సహకరించుకుని ముందుకు సాగితేనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. తాను కాంగ్రెస్ ముఖ్యమంత్రిని కావొచ్చు.. కానీ కేంద్రం సహకారంతో ముందుకు సాగాలని, అందుకే మోదీతో మాట్లాడిన తర్వాత విమానాశ్రయంపై ప్రకటన చేస్తున్నానని రేవంత్ రెడ్డి అన్నారు. ఎర్రబస్సు కష్టమనుకున్న ఆదిలాబాద్‌కు ఎయిర్ బస్సు తీసుకు వచ్చి, పరిశ్రమలు తీసుకొచ్చే బాధ్యతను తీసుకుంటామని హామీ ఇచ్చారు. అత్యంత వెనుకబడిన ఆదిలాబాద్‌ను అభివృద్ధి చేసే బాధ్యతను తాను తీసుకుంటానని ముఖ్యమంత్రి అన్నారు. రాబోయే రెండు నెలల్లో అభివృద్ధి ప్రణాళికతో మళ్లీ వస్తానని, అధికారులతో సమీక్ష నిర్వహించి, ఆదిలాబాద్‌ను ఆదర్శ జిల్లాగా చేస్తానని అన్నారు. కన్నతల్లితో సమానమైన సోనియా గాంధీ ఆశీర్వాదం తీసుకుని తాను ఇక్కడకు వచ్చానని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ ప్రాంతంలో సున్నపు గనులు ఉన్నాయని, కాబట్టి ఇక్కడకు పరిశ్రమను తీసుకువచ్చి వ్యాపార కేంద్రంగా తయారు చేస్తామని హామీ ఇచ్చారు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు నిర్మించి ఆదిలాబాద్‌కు నీరు ఇస్తామని అన్నారు. విద్య, నీటి పారుదల విషయంలో ఆదిలాబాద్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తామని అన్నారు. ఇక్కడ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సిద్ధమని, కానీ ఎక్కడ నిర్మించాలో జిల్లా ప్రజాప్రతినిధులు కలిసి ఒక నిర్ణయానికి రావాలని సూచించారు.

# శ్రీవారి భక్తులకు అలర్ట్..

## వైకుంఠ ద్వార దర్శనాలపై టీటీడీ కీలక ప్రకటన

తిరుమల, డిసెంబర్ 04 : తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనాల కోసం ఎదురుచూస్తున్న భక్తులకు టీటీడీ కీలక సమాచారం ఇచ్చింది. ఈ ఏడాది డిసెంబర్ 30 నుంచి వచ్చే ఏడాది జనవరి 8 వరకు పది రోజుల పాటు భక్తులకు వైకుంఠ ద్వార దర్శన భాగ్యం కల్పించనున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్ల ఆన్‌లైన్ కోటాను రేపు విడుదల చేయనుంది. జనవరి 2 నుంచి 8వ తేదీ వరకు ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతారు. అలాగే శ్రీవాణి ట్రస్ట్ దాతలకు దర్శనం, వసతి గదుల కోటాను అదే రోజు ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు. భక్తులు తమ టికెట్లను టీటీడీ అధికారిక వెబ్‌సైట్ https://ttdevasthanams.ap.gov.in ద్వారా మాత్రమే బుక్ చేసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. ఈసారి వైకుంఠ ఏకాదశి, ద్వాదశి, నూతన సంవత్సరం సందర్భంగా ఈ నెల 30, 31, జనవరి 1 తేదీల్లో సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇస్తూ సర్వదర్శనం టోకెన్లను ఇప్పటికే ఆన్‌లైన్‌లో ఎలక్ట్రానిక్ డిప్ పద్ధతిలో కేటాయించినట్లు టీటీడీ తెలిపింది.

*** కపిలేశ్వరాలయంలో కృత్తిక దీపోత్సవం**

తిరుపతిలోని శ్రీ కపిలేశ్వరాలయంలో బుధవారం కృత్తిక నక్షత్రాన్ని పురస్కరించుకుని కృత్తిక దీపోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ గోపురాలు, ధ్వజస్తంభంపై దీపాలు వెలిగించి, అనంతరం జ్వాలా తోరణం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, ఇతర అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

# పరిశీలన తర్వాతే అనుమతులు

రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గురువారం జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశంలో 31 కంపెనీల పెట్టుబడి ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేశ్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ అధికారులకు కీలక సూచనలు చేశారు. పెట్టుబడులు పెట్టే ప్రతి కంపెనీని పూర్తి స్థాయిలో పరిశీలించిన తర్వాతే అనుమతులు ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "పరిశ్రమల ఏర్పాటులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి. ప్రభుత్వ, కంపెనీల సమయం వృధా కాకుండా 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ, పెట్టుబడులకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలి" అని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఆమోదం పొందిన 31 కంపెనీల ద్వారా రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. ఈ సమావేశంలో మంత్రులు టీజీ భరత్, పి. నారాయణ, కందుల దుర్గేశ్, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్ ప్రత్యక్షంగా పాల్గొనగా, మంత్రులు బీసీ జనార్ధన్ రెడ్డి, పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు వర్చువల్‌గా హాజరయ్యారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

*** ఎస్ఐపీబీ ఆమోదించిన కంపెనీల వివరాలు**

మొత్తంగా ఇప్పటి వరకు 13 సార్లు జరిగిన ఎస్ఐపీబీ సమావేశాల ద్వారా రూ.8.29 లక్షల కోట్ల పెట్టుబడులు రాగా 7,62,148 ఉద్యోగాలు రానున్నాయి. గురువారం జరిగిన 13వ ఎస్ఐపీబీ సమావేశంలో ఎర్లీ బర్డ్ ప్రోత్సాహకాలను అందుకోనున్న ఆరు కంపెనీలతో సహా మొత్తంగా 31 కంపెనీలకు ఆమోదం లభించింది. ఆమోదం పొందిన కంపెనీలు... పెట్టుబడులు... ఉద్యోగాల వివరాలివే...

- చింతా ఎనర్జీ రూ.8,500 కోట్లు 5800 ఉద్యోగాలు
- గనేకో త్రీ ఎనర్జీ రూ.2,140 కోట్లు 1000 ఉద్యోగాలు
- శ్రేష్ఠ రెన్యూవబుల్స్ రూ.70 కోట్లు 339 ఉద్యోగాలు
- క్యూపై ఇండియా రూ.47 కోట్లు 9 ఉద్యోగాలు
- క్యూబైటెక్ స్మార్ట్ సొల్యూషన్స్ రూ.15 కోట్లు 30 ఉద్యోగాలు
- క్యూక్లైర్ వాయన్స్ క్వాంటం ల్యాబ్స్ రూ.14 కోట్లు 512 ఉద్యోగాలు
- సైబ్రా నెక్స్ రూ.10 కోట్లు 1015 ఉద్యోగాలు
- క్యూ బీట్స్ రూ.37 కోట్లు 40 ఉద్యోగాలు
- సెనటల్లా ఏఐ థెరా ప్యూటిక్స్ రూ.6 కోట్లు 40 ఉద్యోగాలు
- ఫార్టీటూ42 టెక్నాలజీ ఇన్నోవేషన్స్ రూ.9 కోట్లు 58 ఉద్యోగాలు
- సిఫ్పా టెక్ ఇండియా రూ.1140 కోట్లు 1251 ఉద్యోగాలు
- శ్రీ తమ్మిన సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ రూ.62 కోట్లు 500 ఉద్యోగాలు
- ఏసీఎన్ హెల్త్‌కేర్ ఆర్సీఎం రూ.30 కోట్లు 600 ఉద్యోగాలు
- నానెల్ టెక్నాలజీస్ రూ.50.67 కోట్లు 567 ఉద్యోగాలు
- పీవీఆర్ హస్పటాలిటీస్ రూ.225 కోట్లు 1230 ఉద్యోగాలు
- మెగ్లాన్ లీజర్స్ రూ.348 కోట్లు 1700 ఉద్యోగాలు
- యాగంటి ఎస్టేట్స్ రూ.61 కోట్లు 250 ఉద్యోగాలు
- నాందీ హోటల్స్ రూ.150 కోట్లు 222 ఉద్యోగాలు
- రిలయెన్స్ కన్స్యూమర్ ప్రొడెక్ట్స్ రూ.1622 కోట్లు 1200 ఉద్యోగాలు
- రామాపట్నం కార్గో రెసిప్షన్ టెర్మినల్ రూ.1615 కోట్లు 1300 ఉద్యోగాలు
- సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ రూ.45 కోట్లు 300 ఉద్యోగాలు
- టీజీవీ ఎస్ఆర్ఏఏసీ రూ.1,216 కోట్లు 400 ఉద్యోగాలు
- శ్రీ వెంకటేశ్వర బయోటెక్ రూ.122 కోట్లు 184 ఉద్యోగాలు
- ఎమర్జ్ గ్లాస్ ఇండస్ట్రీస్ రూ.182 కోట్లు 415 ఉద్యోగాలు
- జీయట్ ఎనర్జీస్ రూ.305 కోట్లు 300 ఉద్యోగాలు
- రామన్ సింగ్స్ గ్లోబల్ ఫుడ్ పార్క్ రూ.141 కోట్లు 600 ఉద్యోగాలు
- గాయత్రి రెన్యూవబుల్ ఫ్యూయల్స్ రూ.320 కోట్లు 700 ఉద్యోగాలు
- మల్లాది డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ రూ.343 కోట్లు 355 ఉద్యోగాలు
- విరూపాక్ష ఆర్గానిక్స్ రూ.1225 కోట్లు 1500 ఉద్యోగాలు
- రాముకా గ్లోబల్ ఎకో వర్క్స్ రూ.193 కోట్లు 426 ఉద్యోగాలు

# ఆ ఒప్పందాలన్నీ 45 రోజుల్లో కార్యరూపం దాల్చాలి

అమరావతి, డిసెంబర్ 04 : ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతోంది. రాష్ట్రంలో రూ.20,444 కోట్ల విలువైన నూతన పెట్టుబడులకు రాష్ట్ర పెట్టుబడుల బోర్డు (SIPB) ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో 56,278 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన గురువారం సచివాలయంలో జరిగిన 13వ ఎస్ఐపీబీ సమావేశంలో ఈ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇటీవల విశాఖలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో కుదిరిన ఒప్పందాల (ఎంఓయూ) పురోగతిపై కూడా సీఎం సమీక్షించారు. సదస్సులో కుదిరిన ఒప్పందాలలో ఇప్పటికే 50 శాతానికి పైగా ఆమోద ప్రక్రియలోకి వచ్చాయని, రాబోయే 45 రోజుల్లోగా మెజారిటీ ఒప్పందాలకు శంకుస్థాపనలు జరగాలని అధికారులను ఆయన గట్టిగా ఆదేశించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, "ప్రభుత్వం అమలు చేస్తున్న 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానం వల్లే ప్రముఖ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నాయి. పరిశ్రమల స్థాపనకు ఎలాంటి ఆటంకాలు లేకుండా పారదర్శకంగా భూమి, నీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో సింగపూర్ వంటి దేశానికి చెందిన కంపెనీలను కూడా ఇబ్బందులకు గురిచేశారు. అలాంటి పరిస్థితులుంటే రాష్ట్రానికి పెట్టుబడులు రావు, అంతర్జాతీయంగా చెడ్డపేరు వస్తుంది. మేము ఆ ప్రతికూల వాతావరణాన్ని చెరిపివేసి, ఏపీకి ఒక బ్రాండ్ ఇమేజ్‌ను తీసుకువచ్చాం. దాని ఫలితమే విశాఖ సదస్సు విజయవంతం కావడం" అని అన్నారు.

**ఒప్పందాల అమలుపై ప్రత్యేక దృష్టి**

విశాఖ సదస్సు జరిగి 20 రోజులు గడవకముందే రూ.7.69 కోట్ల విలువైన ఒప్పందాలు ఆచరణ దిశగా అడుగులు వేస్తున్నాయని సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. "మిగిలిన ఎంఓయూలను కూడా వేగంగా పట్టాలెక్కించాలి. 45 రోజుల్లోగా అన్నింటినీ గ్రౌండింగ్ చేయాలి. వీలైనన్ని పరిశ్రమలకు శంకుస్థాపనలు చేసి దావోస్ సదస్సుకు వెళితే మరిన్ని పెట్టుబడులను ఆకర్షించవచ్చు. దీనిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రతివారం సమీక్షించాలి. ఇకపై ఎస్ఐపీబీతో పాటు ఎంఓయూల పురోగతిని నేనే స్వయంగా పర్యవేక్షిస్తాను" అని చంద్రబాబు స్పష్టం చేశారు. భూసేకరణలో ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా, భూములు ఇచ్చిన వారు కూడా సంతోషంగా ఉండేలా చూడాలని కలెక్టర్లకు సూచించారు.

**భవిష్యత్ ప్రణాళికలు, నూతన ఆలోచనలు**

రాష్ట్రాన్ని నాలెడ్జ్ ఎకానమీగా తీర్చిదిద్దే లక్ష్యంలో భాగంగా ప్రభుత్వ యంత్రాంగం కూడా సాంకేతిక నైపుణ్యాలను పెంచుకోవాలని సీఎం అన్నారు. "క్వాంటం వ్యాలీకి ఒక సలహా మండలిని నియమించండి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రాథమిక అంశాలను 7వ తరగతి నుంచే పాఠ్యాంశంగా చేర్చాలి. దీనికోసం మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి సంస్థల సహకారం తీసుకోండి" అని సూచించారు. దుబాయ్, యూఏఈ తరహాలో రాష్ట్రంలో ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా రూ.500 కోట్ల ప్రారంభ మూలధనంతో 'సావరిన్ ఫండ్' ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా పశువుల దాణాను డ్వాక్రా మహిళా సంఘాల ద్వారా తయారు చేయించే పరిశ్రమలను ప్రోత్సహించాలని, దీనికి నరేగా నిధులను వినియోగించుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని 9 జిల్లాలను హార్టికల్చర్ హబ్‌లుగా అభివృద్ధి చేసి, ఉత్పత్తుల ఎగుమతికి అవసరమైన రవాణా సౌకర్యాలను మెరుగుపరచాలని సీఎం చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. విశాఖ కాపులుప్పాడలో హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణానికి 50 ఎకరాలు కేటాయించాలని ఆదేశించారు. ప్రాజెక్టుల స్థాయిని బట్టి ప్రోత్సాహకాలు అందించే పారదర్శక విధానాన్ని అమలు చేయాలని స్పష్టం చేశారు.

# నా మిత్రుడు పుతిన్‌కు స్వాగతం పలకడం ఎంతో ఆనందంగా ఉంది

ఢిల్లీ, డిసెంబర్ 04: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ రెండు రోజుల కీలక పర్యటన కోసం గురువారం సాయంత్రం ఢిల్లీ చేరుకున్నారు. ఈ పర్యటనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, ప్రోటోకాల్‌ను పక్కనపెట్టి స్వయంగా విమానాశ్రయానికి వెళ్లి పుతిన్‌కు సాదరంగా స్వాగతం పలికారు. ఇద్దరు నేతలు ఆత్మీయంగా ఆలింగనం చేసుకుని, ఒకరినొకరు పలకరించుకున్నారు. అనంతరం ఒకే వాహనంలో విమానాశ్రయం నుంచి బయలుదేరి వెళ్లడం ఇరు దేశాల మధ్య ఉన్న బలమైన స్నేహబంధానికి నిదర్శనంగా నిలిచింది. ఈ ప్రత్యేక స్వాగతంపై ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "నా మిత్రుడు, అధ్యక్షుడు పుతిన్‌కు స్వాగతం పలకడం ఎంతో ఆనందంగా ఉంది. ఆయనతో జరగబోయే సమావేశాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. భారత్‌రష్యా స్నేహం కాలపరీక్షకు నిలిచింది, ఇది మన ప్రజలకు ఎంతో మేలు చేసింది" అని పేర్కొన్నారు. గురువారం రాత్రి ప్రధాని మోదీ తన అధికారిక నివాసమైన లోక్ కల్యాణ్ మార్గ్‌లో పుతిన్‌కు ప్రైవేట్ విందు ఏర్పాటు చేశారు. గత ఏడాది మాస్కో పర్యటనలో పుతిన్ కూడా మోదీకి ఇదే తరహాలో ఆతిథ్యం ఇచ్చారు. 2022లో ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభమైన తర్వాత పుతిన్ భారత్‌కు రావడం ఇదే తొలిసారి. ఈ పర్యటన నేపథ్యంలో ఢిల్లీ వీధులన్నీ పుతిన్‌కు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన బ్యానర్లతో నిండిపోయాయి. శుక్రవారం జరగనున్న 23వ భారత్‌రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశం ఇరు దేశాల మధ్య సంబంధాలలో అత్యంత కీలకమైనది. అమెరికా ఆంక్షల నేపథ్యంలో జరుగుతున్న ఈ సమావేశంలో రక్షణ సహకారాన్ని బలోపేతం చేసుకోవడంపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. దీంతో పాటు వాణిజ్యం, ఇంధన భాగస్వామ్యం, శాస్త్ర సాంకేతిక రంగాలపై కూడా విస్తృతంగా చర్చించనున్నారు. ఈ పర్యటన సందర్భంగా పలు కీలక ఒప్పందాలపై సంతకాలు జరగనున్నాయి. ఈ పర్యటన ఇరు దేశాల 'ప్రత్యేక మరియు విశేష వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని' మరింత బలోపేతం చేస్తుందని విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

## దివ్యాంగులకు దుప్పట్లు అందజేత



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం పురస్కరించుకొని హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం చలికాలంలో ఉపయోగంగా ఉండేలా ఇరవై ఐదు మంది దివ్యాంగులకు దుప్పట్లు అందజేశారు.ఈ కార్యక్రమానికి ప్రపంచ మానవ హక్కుల సమితి జాతీయ చైర్మన్ రావూరి బాలరాజు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయాలంటే మంచి మనసు కావాలన్నారు. హెల్పింగ్ హార్ట్స్ సంస్థ వారు అలాంటి మనసుతో పనిచేయడం అభినందనీయం అన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవస్థాపకులు తూటే విజయ్ కుమార్, జాతీయ డైరెక్టర్లు మధుబాబు చికిలే, నాగరాజు, డాక్టర్ సత్యనారాయణ, పంతుల సాయి, అశోక చక్ర దివ్యాంగుల సంఘం ఏసుబాబు, సాజిత్ దివ్యాంగులు పాల్గొన్నారు.

## నామినేటెడ్ పదవుల్లో స్థానం కల్పించాలి..

* **తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర నాయకులు చిరుమర్తి రాజు**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : 2009 నుండి కాంగ్రెస్ పార్టీనీ నమ్ముకొని పార్టీలో కొనసాగుతూ పార్టీ చేపట్టిన అన్ని కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్న తనకు నామినేటెడ్ పదవుల్లో స్థానం కల్పించాలని కోరుతూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు (టీపీసీసీ) ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర నాయకులు చిరుమర్తి రాజు మర్యాద పూర్వకంగా కలిసి తన బయోడేటా ను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ కి కష్టం చేసిన ఎన్ని ఒడిదుడుకులు వచ్చిన , బెదిరింపులు వచ్చిన భయపడలేదన్నారు.

## కొయ్యలగూడెం సర్పంచ్ అభ్యర్థిగా కైరంకొండ స్వప్న అశోక్ నామినేషన్



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా బిజెపి మద్దతుతో కైరంకొండ స్వప్న అశోక్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. అంతకుముందు గ్రామంలోని దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యకర్తలు, అభిమానులు, మహిళలతో కలిసి ర్యాలీగా కొయ్యలగూడెం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్దకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కైరంకొండ స్వప్న అశోక్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలో 7సంవత్సరాల పాటు ఎన్నికలు జరగకపోవడంతో అభివృద్ధి కొంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు అవకాశం కల్పి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉరివేసుకొని ఆత్మహత్య

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన సద్ది రాజిరెడ్డి (40) అనే డ్రైవర్ బుధవారం తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్ఐ సిహెచ్.గణేష్ తెలిపారు. రాజిరెడ్డి భార్య కొన్ని సంవత్సరాల కిందట చనిపోగా , ప్రస్తుతం తల్లి సద్ది సత్తవ్వ వద్దనే ఉంటున్నాడని తెలిపారు. గత మూడు రోజుల నుంచి ఎలాంటి పనులకు వెళ్లకుండా తాగుతూ ఇంటి వద్దనే ఉంటున్నాడని, రాత్రి అన్నం తిని పడుకున్నాడని, బుధవారం ఉదయం తలుపు తీయకుండా అలానే రూంలో ఉండగా, తలుపులు పగలగొట్టి లోనికి వెళ్లి చూసే సరికి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. మద్యంకు బానిసై, ఒంటరితనంతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని తల్లి సత్తవ్వ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ తెలిపారు.

## విదేశీ విశ్వవిద్యాలయాలు వస్తున్నాయ్!

* **గ్లోబల్ సమిట్‌లో అంగీకారం తెలపనున్న ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీ ఆఫ్ లండన్**

హైదరాబాద్: విదేశీ విశ్వవిద్యాలయాల ఆఫ్ క్యాంపస్‌లు... ఇప్పటివరకు దిల్లీ, గురుగ్రామ్, నోయిడా, ముంబయి, అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నైలలో ఏర్పాటవుతున్నాయి. కొన్ని ఇప్పటికే తరగతులు ప్రారంభించాయి. ఐటీ, ఫార్మా, డిఫెన్స్ తదితర ఎన్నో రంగాలకు హబ్‌గా మారిన హైదరాబాద్‌లో తమ ప్రాంగణాలను నెలకొల్పేందుకు విదేశీ వర్సిటీలు ఎందుకు ఆసక్తి చూపడం లేదు అనే సందేహం ఎంతో మందిని తొలిచేస్తోంది. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌తో హైదరాబాద్‌కు ఆ లోటు తీరనుంది. యూనివర్సిటీ ఆఫ్ లండన్ తన ఆఫ్‌షోర్ క్యాంపస్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించేందుకు ఈ సదస్సులో అంగీకారం తెలపనుంది. అధికారికంగా ఆ వర్సిటీ ప్రతినిధులు ప్రకటించనున్నారు. తొలుత ఒకటి వస్తే ఆ తర్వాత ఒకదాని తర్వాత మరొకటి వచ్చే అవకాశం ఉందని సీనియర్ ఐఏఎస్ అధికారి ఒకరు చెప్పారు.

# వైభవంగా శ్రీ గురు దత్తాత్రేయ స్వామి జయంతి వేడుకలు



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : శ్రీ గురు దత్తాత్రేయ స్వామి జయంతి సందర్భంగా గురువారం భారత్ నగర్ కాలనీ లో హరి హరి క్షేత్రం దేవస్థానంలో దత్తత్రేయ జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. భారత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు పట్లోళ్ల నాగిరెడ్డి గురు స్వామి మాట్లాడుతూ ఆలయంలో స్వామి వారికి అభిషేకం,విష్ణు సహస్రనామ పారాయణం , విశేషమైన పూజలు, భక్తి గీతాలతో స్వామివారిని సేవించుకొని, వచ్చిన భక్తులకు అన్న ప్రసాదం వితరణ చేయడం ఎంతో సంతోషం గా ఉందన్నారు. హిందు సంస్కృతి సంప్రదాయలకు పట్టుకొమ్మలైన ఆధ్యాత్మిక సంస్కృతిని కాపాడుకుందాం అని పేర్కొన్నారు, ఈ కార్యక్రమం లో కమిటీ సభ్యులకు, పెద్దలకు పేరుపేరు నా ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి పి సతీష్ బాబు , సూర్యనారాయణమూర్తి, బి ఆర్ నాగేశ్వరరావు, అప్పా బజార్ నరేష్, శ్రీనివాస్, పూచా మధుసూదన్ రావు, రాంబాబు గౌడ్, వెంకటేష్ యాదవ్, సత్యం శ్రీరంగం , తూము వేణు, రఘు, తూముమనోజ్ కుమార్, కర్క పెంటయ్య, తూము సంతోష్, తూము శ్రావణ్ కుమార్, పంచశీల శ్రీనివాస్, అంబటి శ్రీనివాస్, జిల్లా గోపాల్, వికె రావు , రామకృష్ణ, చప్పిడి శీను, శ్రీనివాస్ గౌడ్, రామ్ అగర్వాల్, హనుమంతరావు, నాంచారయ్య, పి ఆర్ కె రాజు, దత్త సురేష్, ఆనంద్, కళ్యాణి, డాక్టర్ జానకి, భాను ప్రకాష్, తూము ఎల్లారావు, హరి ప్రసాద్, సుధాకర్ రెడ్డి, సాంబశివారెడ్డి, పట్టాభి రెడ్డి, మణెమ్మ, బుచ్చిబాబు వెంకటేశ్వర్, వెంకటేశ్వరరావు, గోపాల్ రెడ్డి, నరేంద్ర గౌడ్, అనిల్, రాంప్రసాద్, సింగర్ రామస్వామి, తదితరులు పాల్గొని శోభాయమానంగా ఈ ఆధ్యాత్మిక వేడుకను నిర్వహించారు.



## నైనికను అభినందించిన సెయింట్ మేరీస్ స్కూల్ యజమాన్యం

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం:ప్రకృతి హరితదీక్ష చేపట్టి... మొక్కలను నాటుతూ ప్రతీ ఒక్కరిలో స్ఫూర్తి నింపుతున్న స్థానిక సెయింట్ మేరీస్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థిని నైనిక రజువాను స్కూల్ యాజమాన్యం అభినందించింది. గురువారం ఉదయం ప్రేయర్ మీటింగ్ సమయంలో పాఠశాల హెచ్ఎం సిస్టర్ రూబీ జ్ఞాపికను అందించి నైనికను అభినందించడంతోపాటు ఆమె తల్లిదండ్రులు దశరథ్ రజువా, ఝాన్సీలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎంఈవో ప్రభుదయాళ్ పంపించిన ప్రోత్సాహక బహుమతిని సిస్టర్ రూబీ చేతులమీదుగా ప్రదానం చేశారు. అనంతరం సిస్టర్ రూబీ మాట్లాడుతూ సింగరేణియన్, మన్‌కీ బాత్‌లో ప్రధాని మోడీచే ప్రశంసలు అందుకున్న ప్రకృతి హరిత దీక్ష వ్యవస్థాపకులు కె.ఎన్.రాజశేఖర్ వద్ద హరిత దీక్ష చేపట్టిన నైనిక రజువా ఇటీవల పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌తోపాటు డాక్టర్ మన్మోహన్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభలోనూ, కోల్ ఇండియా స్థాయి కబడ్డీ పోటీలలో బహుమతి ప్రధానోత్సవం కి ముఖ్య అతిథిగా పాల్గొన్న సింగరేణి సంస్థ సి ఎం డి బలరాం నాయక్ ఐఆర్ఎస్ ప్రశంసలు అందుకున్న నైనిక రజువా మొక్కల ప్రాముఖ్యతను చాటుతూ మనం చెట్లని కాపాడక పోతే ఇలా మొక్కలని వీపున మోయవలసి వస్తది అని తెలియచేస్తూ తను మొక్కను వీపున మోస్తూ చేసిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుందని కొనియాడారు. తన ద్వారా మరికొంతమంది స్ఫూర్తి పొంది మొక్కలు నాటుతుండటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులోనూ నైనిక ఇదే విధంగా మొక్కలు నాటడం, సంరక్షించడంతోపాటు అందరికీ ఆదర్శంగా నిలవాలని, భవిష్యత్ తరాలకు మొక్కల పెంపకాన్ని తెలియజేయాలని సిస్టర్ రూబీ ఆకాంక్షి,చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ హెచ్ఎం నిర్మల, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## నామినేషన్ కేంద్రాలను ఎన్నికల పరిశీలించిన సాధారణ సర్వేశ్వర్ రెడ్డి



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: గ్రామపంచాయతీ ఎన్నికలు-2025 నామినేషన్ ప్రక్రియ పర్యవేక్షణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సాధారణ ఎన్నికల పరిశీలకులు వి. సర్వేశ్వర్ రెడ్డి గురువారం జిల్లాలోని టేకులపల్లి, అల్లపల్లి, గుండాల మండలాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాలను సందర్శించారు. టేకులపల్లి మండలంలోని గంగారం, అల్లపల్లి మండలంలోని అల్లపల్లి, మార్కోడు గ్రామ పంచాయతీలు, గుండాల మండలంలోని మామకన్ను, గుండాల గ్రామ పంచాయతీలు , గుండాల ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ స్వీకరణ నిర్వహణ, అధికారులు చేపట్టిన ఏర్పాట్లు, అమలు చేస్తున్న నియమ నిబంధనలను పరిశీలకులు ప్రత్యక్షంగా పరిశీలించారు. నామినేషన్ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా, ఎలాంటి అంతరాయం లేకుండా సజావుగా కొనసాగుతున్న విధానంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కఠినంగా అమలు చేస్తూ, అభ్యర్థులు, ప్రతినిధులు, ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో ఎలాంటి లోపం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎన్నికలను పూర్తిగా నిష్పక్షపాత, స్వేచ్ఛా వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సర్వేశ్వర్ రెడ్డి ఆదేశించారు. ఈ పరిశ్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఇంచార్జ్తో 'అర్థ' సుధాకర్ రెడ్డి కీలక భేటీ



వికారాబాద్:(ప్రజాస్ఫూర్తి): వికారాబాద్ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, వికారాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు అర్థ సుధాకర్ రెడ్డికి కాంగ్రెస్ అధిష్టానం నుండి అరుదైన ఆహ్వానం లభించింది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ ) పిలుపు మేరకు, తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ శ్రీమతి మీనాక్షి నటరాజన్ గారితో సుధాకర్ రెడ్డి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. తెలంగాణ శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ కి అత్యంత సన్నిహితుడిగా, నమ్మిన వ్యక్తిగా పేరొందిన సుధాకర్ రెడ్డికి. ఏఐసీసీ స్థాయి నుండి పిలుపు రావడం ఆయన రాజకీయ ప్రస్థానంలో కీలక పరిణామంగా చెప్పవచ్చు. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సూచనల మేరకు జరిగిన ఈ సమావేశంలో.. రాష్ట్ర, జిల్లా స్థాయి తాజా రాజకీయ పరిస్థితులపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె. సంతోష్‌కూడా పాల్గొన్నారు. వికారాబాద్ కాంగ్రెస్ పార్టీలో అర్థ సుధాకర్ రెడ్డి ఒక బలమైన గొంతుకగా గుర్తింపు పొందారు. గతంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన, ప్రజా సమస్యలపై కౌన్సిల్‌లో గట్టిగా పోరాడి తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కూడా కార్యకర్తలకు అండగా నిలబడటం, స్పీకర్ ప్రసాద్ కుమార్ అడుగుజాడల్లో నడుస్తూ నియోజకవర్గ అభివృద్ధికి సహకరించడం వంటి అంశాలను అధిష్టానం గుర్తించినట్లు ఈ భేటీ ద్వారా స్పష్టమవుతోంది.కాంగ్రెస్ పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే నాయకులకు అధిష్టానం ఎప్పుడూ తగిన గుర్తింపు ఇస్తుందనడానికి మీనాక్షి నటరాజన్ తో జరిగిన ఈ సమావేశమే నిదర్శనమని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

## డిసెంబర్ 21న జాతీయ లోక్ అదాలత్

* **ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి – పాటిల్ వసంత్**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్ట్ లో డిసెంబర్ 21 వ తారీకున జరిగే జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పాటిల్ వసంత్ , జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాబట్టి మీ మీద కానీ, మీకు తెలిసిన వాళ్ల మీద కానీ, మీ బంధువుల మీద కాని ఏమైనా కేసులు ఉన్నట్లైతే వాటిని (కాంప్రమైజ్ ) రాజీ చేసుకోవచ్చని అన్నారు. కక్షిదారులు తమ కేసులను రాజీమార్గంలో పరిష్కరించుకోవడం వలన సమయం, డబ్బు అదా అవుతుందని అన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారం కొరకై ఈ లోక్ అదాలత్ ను నిర్వహిస్తున్నామని తెలిపారు. కావున అత్యధిక కేసులను పరిష్కరించడం కొరకు పోలీసు అధికారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది కృషి చేయాలని తెలిపారు.

* **యాక్సిడెంట్ కేసులు,సివిల్ కేసులు చీటింగ్ కేసులు,చిట్ ఫండ్ కేసులు**

భూతగాదాలు కు సంబంధించిన కేసులు,వివాహ బంధానికి సంబంధించిన కేసులు,చిన్నచిన్న దొంగతనం కేసులు,ట్రాఫిక్ చాలాన్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు,కుటుంబ తగాదాలు,బ్యాంకు లావాదేవీల కేసులు, టెలిఫోన్ బకాయిల కేసులు,కొట్టుకున్న కేసులు,సైబర్ క్రైమ్ కేసులు,చెక్ బౌన్స్ కేసులు,ఈ లోకదాలత్ లో రాజీ చేసుకుని, కేసును పూర్తిగా క్లోజ్ చేసుకునే అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## వైభవంగా దత్త జయంతి వేడుకలు...

- **ధ్వజా రోహణం, సామూహిక సత్యనారాయణ వ్రతాలు...**
- **వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్...**
- **పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తులు..**



అందోలు, ప్రజాస్ఫూర్తి: అందోలు మండల పరిధిలోని కన్‌సాన్‌పల్లి గ్రామంలో గురువారం దత్తాశ్రమం వద్ద దత్త జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. దత్తగురు ద్వజారోహణ, సామూహిక సత్యనారాయణ వ్రతాలు, సద్గురు పుండరీకం మహారాజ్, అంజయ్య మహారాజ్ గార్ల ఛాయపత పాదుక పూజ, చిన్నెల్లి మొగులయ్య, చిన్నెల్లి చెంద్రయ్య దంపతుల చేతుల మీదుగా శ్రీ దత్తగురు కృష్ణ మహారాజ్ గారి పాదపూజ వంటి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. దత్త జయంతి వేడుకల్లో కన్‌సాన్‌పల్లి, కేరూర్, ఆర్. దత్త జయంతి వేడుకల్లో ఇటిక్యాల, బిజిలీపూర్, ఖాదిరాబాద్, మాసాన్‌పల్లి, గడిపెద్దాపూర్, నాగులపల్లి, మర్వెల్లి, తదితర గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

* **ప్రతి ఒక్కరు దైవభక్తిని కలిగి ఉండాలి : మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్.**

ప్రతి ఒక్కరూ దైవభక్తిని అలవర్చుకోవడంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని అందరూ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. గురువారం దత్త జయంతి వేడుకల్లో పాల్గొని దత్తాశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దత్తాశ్రమ పీఠాధిపతి కృష్ణ మహారాజ్ ఆయనను ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.ఆధ్యాత్మిక చింతనతోనే మనిషికి మనశ్శాంతి కలిగి సమస్యలు దూరమవుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు శేరి మాణిక్ రెడ్డి, చిలుకంటి వెంకటేశం, బిఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు గజేందర్ రెడ్డి, నాయకులు బి. సంగమేశ్వర్, మాధవ్ రెడ్డి, శంకర్ రెడ్డి, ధీరాజ్ రెడ్డి, ప్రభు తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# టీటీడీ లక్కీడిప్‌లో జోగిపేట వాసులకు లక్కు..!

*** వైకుంఠ ఏకాదశి వేళ ...దర్శనానికి మోక్షం**



అందోలు, ప్రజాస్ఫూర్తి: పరమ పవిత్రమైన వైకుంఠ ఏకాదశి (ముక్కోటి)నాడు తిరుమల శ్రీవారిని దర్శించే అవకాశం దక్కడం పట్ల భక్తులు సంతోషానికి అవధులు లేకుండా పోతున్నాయి. జోగిపేటకు చెందిన ఒక ఉపాధ్యాయుడు ఎ.మాణయ్య టీటీడీ నిర్వహించిన లక్కీడిప్‌లో పాల్గొనడంతో అదృష్టవశాత్తు లక్కీడిప్‌లో ఎంపిక కావడంతో తన పూర్వజన్మ సుకృతంగా ఫేస్‌బుక్కులలో తన అభిప్రాయాన్ని వ్యక్త పరిచారు. డిసెంబర్ 31 రాత్రి 8 గం.లకు తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనానికి లక్కీడిప్‌లో ఎంపికయ్యారు. జోగిపేటకు చెందిన ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్ సూర్యప్రకాశ్, బృందావన్ కాలనీలో నివాసం ఉండే సయ్య సాయిలు ఎంపికయ్యారు. ఈ విషయం గురువారం స్థానికంగా చర్చనీయాంశమైంది. తిరుపతి వెంకన్న తన సన్నిధికి పిలుచుకుంటున్న అపురూప అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఎన్నిసార్లు లక్కీడిప్ వేసినా ఎంపిక కాని స్థితిలో ఈసారి వైకుంఠ ఏకాదశి, నూతన సంవత్సరం నాడు తిరుమల ప్రాంగణంలో సతీసమేతంగా ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించే మహద్భాగ్యం కలిగిందని వారు వాఖ్యానిస్తున్నారు. డిసెంబర్ 30,31, జనవరి 1 తేదీలలో తిరుమల క్షేత్రంలో 3 రోజుల వైకుంఠ ద్వార దర్శనానికి 24 లక్షల మంది నమోదు చేసుకుంటే .. లక్షా 76 వేల టోకెన్లను ఎలక్ట్రానిక్ డిప్ ద్వారా కేటాయించగా దాంట్లో ఎంపిక కావడం సాక్షాత్తు శ్రీ వేంకటేశ్వరస్వామి అనుగ్రహమేనని నమ్ముతున్నారు.

# స్కాన్ చెయ్ ఫిర్యాదు చెయ్!

*** 'క్యూఆర్ కోడ్' వ్యవస్థను అందుబాటులోకి తెచ్చిన ఏసీబీ**



హైదరాబాద్: అవినీతిపై ఫిర్యాదులకు క్యూఆర్ కోడ్ అందుబాటులోకి వచ్చింది. అవినీతి నిరోధక విభాగం(ఏసీబీ) డైరెక్టర్ జనరల్ చారుసిన్హా గురువారం క్యూఆర్ కోడ్ ఫిర్యాదుల వ్యవస్థను ప్రారంభించారు. అనంతరం అవినీతి నిర్మూలన నినాదాలతో కూడిన క్యూఆర్ కోడ్ పోస్టర్లను హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో ఆవిష్కరించారు. 'డిసెంబరు 9న అంతర్జాతీయ అవినీతి నిరోధక దినాన్ని పురస్కరించుకుని బుధవారం వారోత్సవాలను ప్రారంభించాం. 9 వరకు జరిగే వారోత్సవాల్లో భాగంగా క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెచ్చాం. ఏసీబీ కార్యాలయాలకు దూరంగా ఉండే ప్రజలు సత్వరం ఫిర్యాదు చేసేందుకు ఈ వ్యవస్థ దోహదపడుతుంది. క్యూఆర్ కోడ్‌లను అన్ని ప్రభుత్వ కార్యాలయాలతోపాటు కీలక కూడళ్లలో అందుబాటులో ఉంచుతాం' అని చారుసిన్హా వివరించారు. ఏసీబీ డైరెక్టర్ తరుణ్‌జోషి, జాయింట్ డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

# హిడ్మాది ముమ్మాటికీ హత్యే!

*** మావోయిస్టు పార్టీ డీకేఎస్‌జడ్‌సీ కార్యదర్శి వికల్ప్ ప్రకటన**



హైదరాబాద్: మావోయిస్టు నేత హిడ్మాది ముమ్మాటికీ హత్యేనని... నిరాయుధుడిని పట్టుకొని చిత్రహింసలు పెట్టి చంపారని పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ (డీకేఎస్‌జడ్‌సీ) కార్యదర్శి వికల్ప్ ఒక ప్రకటనలో ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు కాంట్రాక్టర్లతో పాటు పార్టీ నుంచి పారిపోయిన ఒక సభ్యుడు ఇచ్చిన సమాచారంతోనే అతడిని పట్టుకున్నారన్నారు. గత నెల 27వ తేదీతో ఉన్న ప్రకటన గురువారం బహిర్గతమైంది. 'హిడ్మా అక్టోబరు 27న విజయవాడకు చెందిన ఒక కలప వ్యాపారితో కలిసి చికిత్స కోసం అక్కడికి వెళ్లారు. అనంతరం మరికొందరు పార్టీ సభ్యులూ వెళ్లారు. నిరాయుధులైన ఆరుగురిని నవంబరు 15న పోలీసులు అరెస్ట్ చేశారు. మూడు రోజులపాటు హింసించి... మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌లో చనిపోయినట్లు కట్టుకథ అల్లారు. నవంబరు 19న రంపచోడవరం అడవిలో మరో ఏడుగురు మావోయిస్టులను పట్టుకొని చంపారు. నవంబరు 9న ఓ సభ్యుడు పార్టీ నుంచి పారిపోయి... తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. హిడ్మా ఆచూకీ గురించి అతడికి తెలుసు. నవంబరు 14న హిడ్మాతో పాటు ఐదుగురిని పోలీసులు పట్టుకున్నారు. 50 మంది సభ్యులను అరెస్ట్ చేశారు. హిడ్మాను పోలీసులను పట్టుకున్నట్టు తెలిశాకే ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి విజయ్‌శర్మ పూవర్తి గ్రామానికి వెళ్లి అతడి తల్లిని కలిశారు. లొంగిపోవాలంటూ ఆమెతో ప్రకటన ఇప్పించారు. మారేడుమిల్లి, రంపచోడవరం హత్యాకాండలపై న్యాయవిచారణ జరిపించాలి' అని ప్రకటనలో వికల్ప్ డిమాండ్ చేశారు.

# ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలి

*** సాధారణ పరిశీలకులు సర్వేశ్వర రెడ్డి**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ను ఎట్టి పరిస్థితుల్లోనూ ఖచ్చితంగా అమలు చేయాలని సాధారణ పరిశీలకులు వి. సర్వేశ్వర రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఐడిఓసి కార్యాలయం నుండి తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఏ ఓ లు, ఏ ఈ ఓ లు,పోలీస్ శాఖ అధికారులు, ఎన్నికల సంబంధిత విభాగాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎన్నికల వ్యయ పరిశీలకులు పి. లావణ్య, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన , జెడ్పీసీఈఓ నాగలక్ష్మి పాల్గొన్నారు.ఈ సందర్భంగా సాధారణ పరిశీలకులు సర్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో సాగేందుకు కఠిన చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని స్పష్టం చేశారు. గ్రామాలు, మండలాల వారీగా ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న పరిస్థితులను అధికారులు ఎలా పర్యవేక్షిస్తున్నారో వివరాలు తెలుసుకున్నారు. ఎఫ్ఎస్‌టిఎస్, ఎస్ఎస్‌టి, వివిఎస్‌టి, వి వి టి బృందాలు నిరంతర పర్యవేక్షణ చేయాలని, ఎన్నికలతో సంబంధం ఉన్న చట్టవిరుద్ధ చర్యలను తక్షణమే అరికట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా మద్యం, నగదు, బహుమతుల పంపిణీ వంటి ప్రలోభాలను అడ్డుకోవాలని స్పష్టం చేశారు. ఏ రకమైన అక్రమాలు చోటుచేసుకుంటే కఠినంగా వ్యవహరించాల్సిందిగా అన్ని విభాగాల అధికారులకు సూచించారు. ఏకగ్రీవం అయిన స్థానాలలో ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు సంబరాలు జరగకుండా చర్యలు చేపట్టాలని, ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యేంతవరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని అభ్యర్థులకు అవగాహన కల్పించాలని అన్నారు.ఎన్నికల ప్రక్రియలో ప్రతి దశను వీడియో రికార్డింగ్ చేయాలని అధికారులకు సూచించిన పరిశీలకులు, బృందాలు గ్రామాలు, చెక్‌పోస్టులు, సున్నిత ప్రాంతాలను క్షేత్రస్థాయిలో సందర్శించి నిరంతర పర్యవేక్షణ చేయాలని అన్నారు. ఎన్నికలు స్వచ్ఛంగా, నిష్పక్షపాతంగా, ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా జరుగేలా ఏ చిన్న లోపానికీ తావివ్వకుండా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.ఈ సమీక్షా సమావేశంలో హాజరైన అధికారులను తాము విధుల్లో నిర్లక్ష్యం చూపకూడదని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా ఎన్నికల నిర్వహణలో నిబద్ధతతో పనిచేయాలని సాధారణ పరిశీలకులు సర్వేశ్వర రెడ్డి సూచించారు.

## హెచ్‌ఐఎల్ టీపీ పేరుతో
# భారీ భూ కుంభకోణానికి పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

*** బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**







హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫార్మేషన్ పాలసీ పేరుతో 5 లక్షల కోట్ల రూపాయల భారీ భూ కుంభకోణానికి పాల్పడుతోందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ నగరంలోని పారిశ్రామికవాడల్లో ఉన్న 5 లక్షల కోట్ల రూపాయల విలువైన భూములను దోచుకునే హెచ్‌ఐఎల్ టీపీ కుట్ర మీద పోరుబాట చేస్తూ గురువారం బిఆర్ఎస్ చేపట్టిన పోరుబాట కార్యక్రమంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యఅతిధిగా హాజరవ్వగా, కేటీఆర్ తో పాటుగా బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, పార్లమెంటరీ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డిలు పాల్గొని ప్రభుత్వ వ్యతిరేక నిర్ణయాలను ఎండగట్టారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియా ముఖంగా సీఎం రేవంత్ రెడ్డి తీరుపై మీడియా ముఖంగా తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకప్పుడు ప్రభుత్వాలు ప్రజలకు, పరిశ్రమల కోసం, ఉద్యోగ ఉపాధి కల్పన కోసం ఇచ్చిన భూములను ఇప్పుడు ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారన్నారు. పరిశ్రమలు వద్దంటూ... అపార్ట్‌మెంట్లు, విల్లాలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు కట్టుకోమని పారిశ్రామిక భూములను ఇస్తున్నారన్నారు. ప్రభుత్వం చెబుతున్నట్లు అవి ప్రైవేట్ వ్యక్తుల భూములు కావు. ప్రైవేట్ వ్యక్తులకు ప్రజల కోసం ప్రభుత్వం ఇచ్చిన భూములు. కేవలం పరిశ్రమలు పెట్టి ఉపాధి కల్పించాలన్న నిబంధనలతోనే ఆ భూములను ఇవ్వడం జరిగిందన్నారు. మార్కెట్‌లో గజం ధర లక్షన్నర రూపాయలు పలుకుతుంటే, ప్రభుత్వం కేవలం 4,000 రూపాయలకే ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్తోందన్నారు. హైదరాబాద్ నగరంలో పేదలకు ఇండ్లకు, పాఠశాలలకు, ఆసుపత్రులకు, చివరికి స్మశానాలకు కూడా స్థలం లేదు. కానీ, ప్రైవేట్ వ్యక్తులకు 9,300 ఎకరాల భూమిని ప్రభుత్వం అప్పనంగా ఇస్తామంటోందన్నారు. ఈ 9,300 ఎకరాల భూములను తిరిగి వెనక్కి తీసుకొని, అక్కడ కాంగ్రెస్ చెబుతున్న ఇందిరమ్మ ఇండ్లు, యంగ్ ఇండియా స్కూల్స్, ఆసుపత్రులు కట్టాలన్నారు. హైదరాబాద్‌లో స్థలం లేదని చెప్పి ఇప్పటిదాకా ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా కాంగ్రెస్ కట్టలేదన్నారు. ఇక్కడ ఉన్న కంపెనీలు తరలివెళ్తే, హైదరాబాద్ నగరంలో వాటిపైన ఆధారపడిన లక్షల మంది ఉపాధి పోతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఈ కుంభకోణాన్ని ప్రజలకు వివరించేందుకే పారిశ్రామిక వాడల్లో పర్యటిస్తున్నామని, ప్రైవేట్ వ్యక్తులకు ఇస్తున్న భూముల ధర నిర్ధారణ, దాని వెనుక ఉన్న అసలు నిజాలు నిగ్గుతేల్చాలన్న ఉద్దేశంతోనే ఈ పర్యటనలు చేస్తున్నామన్నారు. ఈ అంశాన్ని ఇక్కడితో మా పార్టీ వదిలిపెట్టదన్నారు.



*** హిల్ట్ పాలసీ కుంభకోణం పైన త్వరలో అఖిలపక్ష సమావేశం**

హిల్ట్ పాలసీ కుంభకోణం పైన త్వరలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి నగరంలో కాలనీలలో ప్రజలకు ఈ అంశాన్ని వివరిస్తామన్నారు. రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తాము. ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీలను కలుపుకొని ముందుకు పోతామన్నారు. ఈ పాలసీని వెనక్కి తీసుకొని, లక్షల కోట్ల విలువైన ప్రజల భూమిని కాపాడే దాకా మా పోరాటం కొనసాగుతుందన్నారు. అవసరమైతే న్యాయపోరాటం చేస్తామన్నారు. మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ పాలసీని రద్దు చేస్తామని, అవసరమైతే ఇందుకోసం ఒక చట్టాన్ని తీసుకువస్తామన్నారు. రేవంత్ రెడ్డి భూ కుంభకోణంలో భాగస్వాములు కావద్దని పారిశ్రామికవేత్తలకు విజ్ఞప్తి చేశారు. ఎవరైనా అత్యాశకు వెళ్లి ప్రభుత్వానికి డబ్బులు కడితే, అటు పారిశ్రామిక భూములతో పాటు డబ్బులు కూడా పోతాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

*** చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వం చేస్తున్న దోపిడీ పైన ప్రజలకు సమాధానం చెప్పాలి**

రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఇంతటి భారీ కుంభకోణాన్ని, దోపిడీని చూసి తట్టుకోలేక... తెలంగాణ పట్ల ప్రేమ ఉన్న ఓ తెలంగాణ బిడ్డ మాకు సమాచారం ఇచ్చారు. ప్రభుత్వం చేస్తున్న దోపిడీ పైన మేము అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, సమాచారం లీక్ అయింది అంటూ ప్రభుత్వం బాధపడుతోందన్నారు. చిత్తశుద్ధి ఉంటే తమ ప్రభుత్వం చేస్తున్న దోపిడీ పైన ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. మేము పర్యటిస్తున్న జీడిమెట్ల ప్రాంతంలో మార్కెట్ ధర గజానికి కనీసం లక్ష రూపాయలు ఉంది. కానీ ప్రభుత్వం మాత్రం కేవలం 4,000 రూపాయలకే పూర్తిగా భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడతామని చెబుతోంది. ఒకవైపు 170 కోట్ల రూపాయలకు ఎకరం చొప్పున భూములు అమ్మిన ప్రభుత్వం అంటూ రోజు వార్తలు రాయించుకుంటున్న సర్కార్, మరోవైపు కేవలం కోటి రూపాయలకు ఎకరం చొప్పున జీడిమెట్లలో భూమిని ఎలా అమ్ముతుంది? ఇది కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుంభకోణానికి క్షేత్రస్థాయిలో ఉన్న నిదర్శనమన్నారు. గతంలో తెచ్చిన గ్రిడ్ పాలసీ ద్వారా కేవలం ఐటీ కార్యాలయాలు మాత్రమే నిర్మాణం చేసేందుకు అవకాశం ఉండేది. ఐటీ కార్యాలయాల ఏర్పాటు వలన ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు ఆర్థిక కార్యకలాపాలు కూడా పెరుగుతాయి, పరోక్షంగా అనేకమందికి ఉపాధి లభిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, మా పాలసీ ఆదర్శం అయితే... ఈ పారిశ్రామిక భూములలో ఎలాంటి కాలుష్యం లేని పరిశ్రమలకు మాత్రమే తిరిగి భూములు కేటాయించాలన్నారు.

*** ఐటీ పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు మాత్రమే అనుమతించాలి**

.ఐటీ వంటి పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు మాత్రమే అనుమతించాలి అంతేకానీ అప్పనంగా అపార్ట్‌మెంట్లకు, విల్లాలకు ఇస్తామంటే కుదరదు. హైదరాబాద్ నగరం నుంచి కాలుష్య కారక పరిశ్రమలను బయటకి పంపించాలన్నది అందరి ఉద్దేశం. అందుకే ఎలాంటి పొల్యూషన్ లేని అంతర్జాతీయ స్థాయి ఫార్మాసిటీని ఏర్పాటు చేశాము. దాన్ని కూడా రేవంత్ రెడ్డి తన రియల్ ఎస్టేట్ వ్యాపారానికి వాడుకుంటున్నాడు.రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ పేరుతో ఫార్మాసిటీ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. రేవంత్ రెడ్డికి తెలిసింది కేవలం రియల్ ఎస్టేట్ దందా మాత్రమే. అందుకే అక్కడ ఫార్మాసిటీలోనూ, ఇక్కడ పారిశ్రామిక భూముల్లోనూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు.అనంతరం జీడిమెట్ల పారిశ్రామిక లోని పలు పరిశ్రమలను సందర్శించి కార్మిక సమస్యలపై కార్మికులతో, పారిశ్రామిక వేత్తలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ బ్యూరోక్రాట్లతో ఇంటర్వ్యూ బోర్డు ఏర్పాటు చేస్తాం

*** డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

*** 50 మంది సివిల్స్ అభ్యర్థులకు రూ.లక్ష చొప్పన ఆర్థిక సహాయం అందజేత**

హైదరాబాద్: రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం పథకం కింద సివిల్ సర్వీసెస్ మెయిన్స్, ఇంటర్వ్యూలకు ఎంతమంది ఎంపికైనా వారికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సివిల్స్ అభ్యర్థుల అభిప్రాయాలతో ఈ పథకాన్ని మరింత తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. గురువారం ప్రజాభవన్‌లో యూపీఎస్సీ ఇంటర్వ్యూలకు ఎంపికైన 50 మందికి మంత్రి పొన్నం ప్రభాకర్, సింగరేణి సీఎండీ బలరాంతో కలిసి భట్టి విక్రమార్క చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. సివిల్స్ అభ్యర్థులు ఇంటర్వ్యూలను సమర్థంగా ఎదుర్కొనేలా ప్రభుత్వంలోని సీనియర్ బ్యూరోక్రాట్లతో ఇంటర్వ్యూ బోర్డును ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఆర్థిక ఇబ్బందులతో సివిల్స్‌కు ఎంపిక కాలేకపోతున్న రాష్ట్ర యువతకు సింగరేణి ఆధ్వర్యంలో రూ.లక్ష ఆర్థిక సహాయంతోపాటు దిల్లీలో వసతి సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. గతేడాది 20 మంది ఇంటర్వ్యూలకు వెళ్లగా వారిలో ఏడుగురు సివిల్స్‌కు ఎంపికయ్యారన్నారు. గతేడాది 140 మంది మెయిన్స్‌కు ఎంపిక కాగా ఈ ఏడాది 202 మంది ఉన్నారని, 50 మంది ఇంటర్వ్యూలకు వెళ్లనున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సింగరేణి ఉన్నతాధికారులు గౌతం పొట్రు, ఈడీ వెంకన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ఇతర రాష్ట్రాల్లోనూ ప్రాజెక్టులు: డిప్యూటీ సీఎం

సింగరేణి సంస్థ వ్యాపార విస్తరణలో భాగంగా తొలిసారిగా ఇతర రాష్ట్రాల్లోనూ విద్యుత్తు, గ్రీన్‌ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సింగరేణి సంస్థతో కలిసి రాజస్థాన్ రాజ్య విద్యుత్తు ఉత్పాదన్ నిగమ్ లిమిటెడ్ 2300 మెగావాట్ల విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు ఇటీవల రాజస్థాన్ మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఆ రాష్ట్ర విద్యుత్తుశాఖ మంత్రి హీరాలాల్‌నగర్ గురువారం ప్రజాభవన్‌లో భట్టిని కలిశారు. ఒప్పందంలో భాగంగా 1500 మెగావాట్ల సోలార్, 800 మెగావాట్ల థర్మల్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

# రూ.5లక్షల కోట్ల భూ కుంభకోణంపై క్షేత్రస్థాయిలో పోరాడతాం: కేటీఆర్

హైదరాబాద్: పారిశ్రామిక భూములను చౌకధరకు ప్రైవేటు వ్యక్తులకు కట్టబెడుతున్నారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. పారిశ్రామిక భూముల బదలాయింపు అంశంపై భారత రాష్ట్ర సమితి నిజనిర్ధారణ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నాయి. ఈ క్రమంలో జీడిమెట్ల పారిశ్రామికవాడలో కేటీఆర్ పర్యటించి హమాలీలతో మాట్లాడారు. ఆరు నెలలుగా భూముల దోపిడీ జరుగుతోందని, పాలసీ ఇప్పుడు బయటికొచ్చిందన్నారు. ప్రభుత్వం చేస్తున్న భూదోపిడీని కార్మిక సంఘాలు అడ్డుకోవాలన్నారు. రూ.5 లక్షల కోట్ల భూదోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజల సొమ్ము ప్రజలకే దక్కాలని డిమాండ్ చేశారు. "రూ.5 లక్షల కోట్ల భూకుంభకోణంపై క్షేత్రస్థాయిలో పోరాడతాం. ఆషాఢం సేల్



వంటి ఆఫర్‌ను చూసి పారిశ్రామికవేత్తలు మోసపోవద్దు. రేవంత్‌రెడ్డి భూకుంభకోణంలో మీరు భాగం కావొద్దు. మా ప్రభుత్వం వచ్చాక ఆ భూములు వెనక్కి తీసుకుంటాం. రేవంత్‌రెడ్డి అవినీతి అనకొండ. ఢిల్లీకి మూటలు పంపేందుకు.. దోచుకునేందుకు కుట్ర చేస్తున్నారు. ఎవరి ప్రయోజనాల కోసం భూములను ధారాదత్తం చేస్తున్నారు?" అని కేటీఆర్ ప్రశ్నించారు.




## పంచాయతీ ఎన్నికలు..
## తొలి విడతలో 395 గ్రామాలు ఏకగ్రీవం

హైదరాబాద్: తెలంగాణలో తొలి దశ పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే మొదటి విడత ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ నిన్నటితో ముగిసింది. ఈ క్రమంలో 395 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మొత్తం 9,331 వార్డులు ఏకగ్రీవమైనట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. తొలి విడతలో 8,095 సర్పంచి అభ్యర్థులు, 9,226 వార్డు సభ్యుల అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకొన్నారు. ఈ నెల 11న తొలి విడతలో మిగిలిన 3,836 పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి.

## క్వాంటం ఎకానమీ లీడర్‌గా హైదరాబాద్: డిప్యూటీ సీఎం

భవిష్యత్తులో క్వాంటం ఎకానమీ లీడర్‌గా హైదరాబాద్ నిలుస్తుందని.. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, డిజిటల్ నైపుణ్యం వంటి అన్ని వనరులు హైదరాబాద్‌లో దండిగా ఉన్నాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు చెప్పారు. ట్రిపుల్ ఐటి గచ్చిబౌలిలో నీతి ఆయోగ్ రోడ్ మ్యాప్ ఫర్ క్వాంటం అండ్ తెలంగాణ క్వాంటం స్ట్రాటజీ ఆవిష్కరణ సమావేశంలో భట్టి మాట్లాడారు. నీతి ఆయోగ్ రోడ్డు మ్యాప్ తెలంగాణ రైజింగ్ 2047, 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా మార్చే రాష్ట్ర దృష్టికోణానికి అనుగుణంగా రూపొందించబడిందని అభివర్ణించారు. తెలంగాణ క్వాంటం వ్యూహం ద్వారా క్వాంటం టెక్నాలజీకి ప్రత్యేక రోడ్‌మ్యాప్ కలిగిన దేశంలోని తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందని తెలిపారు. క్వాంటం టెక్నాలజీ అన్ని రంగాల్లోనూ మార్పు తీసుకురాబోతున్నదని చెప్పారు. తెలిపారు. గొప్ప భవిష్యత్తు కోరుకునే ఏ దేశానికైనా క్వాంటం వ్యూహం అవసరమని అన్నారు. దేశాల భవిష్యత్తు, వారి జాతీయ భద్రత, వారి ఆర్థిక పరిమాణం, అభివృద్ధి, అన్నింటినీ ఇది పెద్ద స్థాయిలో ప్రభావితం చేస్తుందని తెలిపారు. స్టార్టప్‌ల లక్ష్యాలను చేరుకోవడంలో కూడా క్వాంటం ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. క్వాంటం కేవలం వ్యాపారం లేదా ఆర్థికాభివృద్ధికే కాదు, కంప్యూటింగ్, కమ్యూనికేషన్స్, సైబర్ సెక్యూరిటీ సామర్థ్యాల పెంపునకు కూడా కీలకమని తెలిపారు. సమావేశంలో నీతి




ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం, సభ్యులు డా.వీకే సారస్వత్, దేబ్జాని ఘోష్, స్పెషల్ సీఎస్ సంజయ్‌కుమార్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రెటరీ కృష్ణభాస్కర్, ఐఐఐటీ హైదరాబాద్, ఐఐటీ హైదరాబాద్, సీఆర్ రావు ఇన్‌స్టిట్యూట్, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ ప్రముఖులు పాల్గొన్నారు.

*** తొలిసారి లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీ**

క్వాంటం సిటీగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. క్వాంటం టెక్నాలజీలో తెలంగాణను గ్లోబల్ లీడర్‌గా మార్చేలా నిపుణులు, పరిశ్రమల భాగస్వామ్యంతో దేశంలోనే తొలిసారిగా లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీని రూపొందించామన్నారు. అప్పట్లో విద్యుత్, ఇంటర్నెట్ లాంటి ఆవిష్కరణలు ప్రపంచం రూపురేఖలు మార్చాయన్నారు. అదే తరహాలో రాబోయే రోజుల్లో క్వాంటం టెక్నాలజీ కూడా అనేక మార్పులకు శ్రీకారం చుట్టబోతున్నదన్నారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీ తదితర కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్‌లో తెలంగాణను గ్లోబల్ లీడర్‌గా మార్చేలా పకడ్బందీ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీలో భాగంగా రీసెర్చ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సైబర్ సెక్యూరిటీ, లైఫ్ సైన్సెస్ యాక్సిలరేషన్, టాలెంట్ పైప్‌లైన్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఈ టెక్నాలజీలో దేశానికి ఒక బెంచ్ మార్క్ సెట్ చేసేలా ప్రత్యేకంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు కూడా శ్రీకారం చుట్టామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి స్టార్టప్స్, కొత్త ఆలోచనలకు భరోసానిచ్చేలా ఫండ్స్ ఆఫ్ ఫండ్స్‌ను ప్రారంభించబోతున్నట్లు చెప్పారు. ఇండస్ట్రీ డే పేరిట ప్రతి వారంలో ఒకరోజు అధికారులు, ప్రతి నెలలో ఒక రోజు సంబంధిత మంత్రి పారిశ్రామికవేత్తలతో ప్రత్యేకంగా సమావేశమవుతారన్నారు.

## పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లలో
## జోక్యం చేసుకోలేం: హైకోర్టు

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం కేటాయించిన రిజర్వేషన్‌ల వ్యవహారంలో దాఖలైన ఆరు పిటిషన్‌లపై విచారించిన హైకోర్టు ఇవాళ తీర్పు వెలువరించింది. పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. చట్టప్రకారం ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని ధర్మాసనం తెలిపింది. ఎస్సీ, ఎస్టీ జనాభా లేని చోట కూడా ఆయా కులాలకు వార్డుమెంబర్లు, సర్పంచి రిజర్వేషన్లు కేటాయించారన్న పిటిషనర్లు



కోర్టు దృష్టికి తెచ్చారు. 2011 జనాభా లెక్కల ప్రకారం సర్పంచి రిజర్వేషన్లు కేటాయించడం వల్ల తప్పులు దొర్లాయని తెలిపారు. రిజర్వేషన్లు కేటాయించిన చోట సంబంధిత కులానికి చెందిన వ్యక్తులు లేకపోతే ఎన్నికల నిర్వహించబోమని ఎన్నికల సంఘం కోర్టుకు తెలిపింది. ఎస్ఈసీ వాదనను రికార్డు చేసుకున్న హైకోర్టు.. పిటిషన్లపై విచారణ ముగించింది.

## ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహం
## రవీంద్ర భారతిలో పెడితే తప్పేంటి?: మహేశ్‌కుమార్ గౌడ్

హైదరాబాద్: తెలంగాణ సెంటిమెంట్‌తో భారత రాష్ట్ర సమితి లబ్ధి పొందే ప్రయత్నం చేస్తోందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. దేవుళ్ల విషయంలో సీఎం రేవంత్ చెప్పిన సామెతను రాజకీయం చేయడం తగదని చెప్పారు. "కొణిజేటి రోశయ్య, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఒక ప్రాంతానికి చెందిన వారు కాదు. ఈ దేశానికి వారు సంపద. బాలసుబ్రహ్మణ్యం విగ్రహం రవీంద్ర భారతిలో పెడితే తప్పేంటి?



భారత రాష్ట్ర సమితి కోసమే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పనిచేస్తున్నారు. హిల్ట్ పాలసీ ద్వారా హైదరాబాద్‌లో సామాన్యులకు భూముల ధరలు అందుబాటులోకి వస్తాయి. కాలుష్య రహిత నగరంగా హైదరాబాద్ మారుతుంది. అవినీతికి అలవాటు పడిన కేసీఆర్ కుటుంబానికి.. మా ప్రభుత్వం ఏం చేసినా అవినీతి అంటూ ఆరోపణలు చేయడం అలవాటుగా మారింది" అని మహేశ్‌కుమార్ గౌడ్ విమర్శించారు.

## భారీగా అక్రమాస్తులు..
## ల్యాండ్ రికార్డు ఏడీ శ్రీనివాస్ అరెస్ట్

హైదరాబాద్: అక్రమాస్తుల కేసులో రంగారెడ్డి జిల్లా ల్యాండ్ రికార్డు ఏడీ శ్రీనివాస్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఏడీ శ్రీనివాస్ నివాసం, బంధువుల ఇళ్లలో సోదాలు నిర్వహించిన ఏసీబీ అధికారులు తెలంగాణ, ఏపీ, కర్ణాటకల్లో భారీగా ఆస్తులు ఉన్నట్టు గుర్తించారు. మొత్తం ఆరు ప్రాంతాల్లో సోదాలు చేసిన అధికారులు.. రాయదుర్గం మైహోంభుజలో ఫ్లాట్, కర్ణాటకలో 11 ఎకరాల వ్యవసాయ భూమి, అనంతపురంలో 11 ఎకరాలు, మహబూబ్‌నగర్‌లో నాలుగు ప్లాట్లు, నారాయణపేటలో రైస్ మిల్లు, 3 ప్లాట్లు



ఉన్నట్టు అధికారులు తెలిపారు. సోదాల్లో రూ.5లక్షల నగదు, 1.6 కిలోల బంగారం, 770 గ్రాముల వెండి, 2 కార్లు, పలు పత్రాలను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

## ఆ రెండు దేశాల్లో బంధీలుగా భారత యువత: ఎంపీ అర్వింద్

విదేశాల్లో ఉద్యోగాల పేరుతో నిరుద్యోగ యువతను మోసం చేసి విదేశాల్లో యువతను బంధీలుగా మార్చుతున్న గ్యాంగులను అరికట్టాలని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి అన్నారు. గురువారం ఆయన పార్లమెంటులో మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల నుండి ముఖ్యంగా యువతను థాయ్ లాండ్‌లో ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మబలికి,



నిరుద్యోగుల నుండి లక్షలాది రూపాయలు ఏజెంట్లు వసూలు చేస్తున్నారని అర్వింద్ పార్లమెంటు దృష్టికి తీసుకొచ్చారు. ఎన్నో ఆశలతో ఉద్యోగంలో చేరేందుకు అక్కడికి వెళ్లిన వెంటనే వారి పాస్ పోర్టులను స్వాధీనం చేసుకుని హింసిస్తున్నారని అన్నారు. ఈ నేరాలకు స్థానిక మిలీషియా, సైన్యంలో కొందరు లంచాలు తీసుకుని సహకరిస్తున్నందున రక్షణ చర్యలు మరింత కష్టతరం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ముఠాకు బలైన వారిలో నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన పలువురు యువకులు కూడా ఉన్నారని, వారంతా ప్రస్తుతం అక్కడే చిక్కుకుపోయి ఉన్నారని ఆయన హౌజ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ పరిస్థితిని అత్యవసరంగా పరిగణించి, ఆయా దేశాల్లో చిక్కుకున్న భారతీయ నిరుద్యోగ యువకులను రక్షించి, వారిని తిరిగి స్వదేశానికి రప్పించే చర్యలు చేపట్టాలని అర్వింద్ కోరారు.

## అమరావతికి నాబార్డు భారీగా రుణం..
## సీఆర్డీఏ అథారిటీ ఆమోదం

రాజధాని అమరావతిని ఓ సృజనాత్మక నగరంగా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు అడుగులు వేస్తున్నారు. అక్కడ నిర్మించే ప్రతీ భవనం విలక్షణంగా ఉండాలని నిర్ణయించారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో 55వ సీఆర్డీఏ అథారిటీ సమావేశం నిర్వహించింది. రాష్ట్ర రాజధానిలో నిర్మించే ప్రతీ భవనం ప్రస్ఫుటంగా కనిపించేలా ఉండాలని, పచ్చదనంతో అలరారేలా అమరావతి నిర్మాణాలు ఉండాలని నిర్ణయించింది. అమరావతిలోని గవర్నమెంట్ కాంప్లెక్స్‌లో గవర్నర్ నివాస సముదాయం లోక్ భవన్ నిర్మాణం కోసం



చేసిన ప్రతిపాదనలకు ఈ సందర్భంగా సీఆర్డీఏ అథారిటీ సభ్యులు ఆమోదం తెలిపారు. దీంతో రూ.169 కోట్ల వ్యయంతో లోక్ భవన్ నిర్మాణాలు చేపట్టనున్నారు. అలాగే రూ. 165 కోట్ల వ్యయంతో ఏపీ జ్యూడిషియల్ అకాడమీ నిర్మాణ ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు.

## వ్యక్తి ఎదుగుదలను సమర్థించే వ్యక్తి రోశయ్య

వ్యక్తి ఎదుగుదలను సమర్థించే వ్యక్తి రోశయ్య అని, నూతన శాసన సభ్యులకు రోశయ్య ప్రసంగాలు ఒక పుస్తకం వంటివని తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, కొణిజేటి రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కొణిజేటి రోశయ్య 4వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ వర్ధంతి సభకు తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, తెలంగాణ శాసనసభపతి గడ్డం ప్రసాద్, మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లు పాల్గొని రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ.. క్రమశిక్షణకు మారుపేరు రోశయ్య అని ఆయన అన్నారు. సమయ పాలన పాటించే వారని తెలిపారు. ప్రభుత్వం రోశయ్య జయంతి , వర్ధంతిని అధికారికంగా నిర్వహించడం అభినందనీయం అని గుత్తా అన్నారు. నిండు తెలుగుదనానికి



ప్రతిరూపం రోశయ్య అని తెలంగాణ శాసనసభపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. రాజకీయంగా విభేదాలు ఉన్నప్పటికీ, వ్యక్తిగతంగా అందరికి అజాత శత్రువు అని ఆయన వివరించారు. అప్పులు ఆడంబరాలు పోకుండా , ఆర్థిక మంత్రిగా ఉమ్మడి రాష్ట్రాన్ని నడిపారని ఆయన చెప్పారు. ముగ్గురు ముఖ్యమంత్రులు దగ్గర ఆర్థిక మంత్రిగా తనదైన ముద్ర వేసుకున్నారని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రోశయ్య మాటలు , తీరులో, వ్యక్తిత్వంలో పెద్దరికాన్ని నేటి తరానికి అందించిన వ్యక్తి అని ఆయన కొనియాడారు. నేటి రాజకీయ నాయకులు రోశయ్య ని ఆదర్శంగా తీసుకొని పని చేయాలని పొన్నం ప్రభాకర్ సూచించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ. వీహెచ్ హనుమంతరావును సన్మానించి రోశయ్య మెమోరియల్ అవార్డు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్సీలు దయానంద గుప్తా, ఫారూఖ్, ఏపీ మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే లు జగ్గారెడ్డి, గణేష్ గుప్తా, ఏపీ మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ ఎంఎల్సీ, ఆర్య వైశ్య కార్పొరేషన్ కాల్వ సుజాత, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దామోదర్ గుప్తా, టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ‘భోపాల్ బూడిద’పై ఆందోళన.. ప్రమాదం లేదన్న మంత్రి

మధ్యప్రదేశ్‌లోని యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో 900 మెట్రిక్ టన్నుల ప్రమాదకర వ్యర్థాలను రాష్ట్ర ప్రభుత్వం కొన్ని నెలల క్రితం దహనంచేసిన సంగతి తెలిసిందే. అయితే, దానివల్ల ఉత్పన్నమైన బూడిదపై స్థానికుల్లో ఆందోళన మొదలైంది. తాజాగా దీనిపై సంబంధిత మంత్రి స్పందిస్తూ.. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, న్యాయస్థానం మార్గదర్శకాల ప్రకారం దానిని పారవేస్తామని పేర్కొన్నారు. భోపాల్ విషవాయువుల దుర్ఘటనకు 41ఏళ్లు కావడం,



ఇటీవల ప్రభుత్వం తీసుకున్న చర్యలపై రాష్ట్ర మంత్రి మాట్లాడారు. ‘‘ఈ దుర్ఘటన జరిగి 41ఏళ్లు అయ్యింది. ఫ్యాక్టరీ వ్యర్థాలు విషపూరితమైనవని ప్రజల్లో విపరీత భయం నెలకొంది. ఆ వ్యర్థాలన్నింటినీ దహనం చేసి ప్రజల్లో భయాన్ని పోగొట్టే ప్రయత్నం చేశాం. ఇప్పుడు బూడిద మాత్రమే మిగిలే ఉంది. సుప్రీం కోర్టు, హైకోర్టు మార్గదర్శకాల ప్రకారం వాటిని పారవేస్తాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు’’ అని మంత్రి విజయ్ సిన్హా పేర్కొన్నారు. యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ వ్యర్థాలను దహనం చేసే ప్రక్రియ ఇటీవల పూర్తికాగా.. వీటిద్వారా దాదాపు 900 టన్నుల బూడిద వచ్చింది. దీన్ని పీథంపుర్ ప్లాంట్‌లో భారీ గుంతలో పడేయాలని అధికారులు ప్రణాళిక వేసినప్పటికీ.. నివాస ప్రాంతాలకు దగ్గరల్లో ఉందనే కారణంతో ఈ ప్రతిపాదనను హైకోర్టు తోసిపుచ్చింది. ప్రత్యామ్నాయాలను పరిశీలించాలని ఆదేశించింది. ప్రస్తుతం ఆ బూడిదను లీక్‌ప్రూఫ్ స్టోరేజీల్లో సురక్షితంగా భద్రపరచినట్లు సమాచారం. స్థానిక పారిశ్రామిక ప్రాంతంలోనే దీనిని పారవేస్తారని పీథంపుర్ ప్రజలు ఆందోళన చెందుతున్నప్పటికీ.. మంత్రి దీనిపై స్పష్టతనివ్వలేదు. భోపాల్‌లో అమెరికాకు చెందిన యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీ నుంచి 1984 డిసెంబరు 23వ తేదీ రాత్రి మిథైల్ ఐసోసైనేట్ విషవాయువులు విడుదలయ్యాయి. వాటి కారణంగా అప్పట్లో 5479 మంది ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 5లక్షల మందికిపైగా ప్రభావితమయ్యారు. ప్రపంచంలో అత్యంత ఘోర పారిశ్రామిక విపత్తుల్లో ఒకటిగా నిలిచిన ఈ ఘటన బాధితులు నాలుగు దశాబ్దాలుగా న్యాయం కోసం పోరాటం చేస్తూనే ఉన్నారు.

## మోదీ ఒత్తిడికి తలొగ్గే వ్యక్తి కాదు: పుతిన్

భారత్‌ను ప్రపంచం గ్లోబల్ పవర్‌గా చూస్తోందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. ప్రధాని మోదీ ఇతర శక్తుల ఒత్తిడికి తలొగ్గే వ్యక్తి కాదని అభిప్రాయపడ్డారు. పరోక్షంగా అమెరికా విధించిన సుంకాలను ఉద్దేశిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు చేరుకున్న ఆయన ‘ఇండియా టుడే’కు ఎక్స్‌క్లూజివ్‌గా ఇంటర్వ్యూ ఇచ్చారు. భారత్ ప్రారంభించిన ‘మేకిన్ ఇండియా’ పథకాన్ని పుతిన్ ప్రశంసించారు. స్వాతంత్ర్యం తర్వాత భారత్ సాధించిన పురోగతిని కొనియాడారు. భారత్‌రష్యా



మధ్య ఇంధన సహకారం కొనసాగుతుందని తెలిపారు. ఎలాంటి ఆర్థిక విధానాలను అనుసరించాలన్నది తమ ఇష్టమని పరోక్షంగా ట్రంప్ టారిఫ్‌ల అంశాన్ని విమర్శించారు. భారత్ రష్యా మధ్య ఉన్న వాణిజ్య అంతరాన్ని భర్తీ చేసేందుకు కృషి చేస్తామని పుతిన్ తెలిపారు. అందులో భాగంగా భారత్ నుంచి దిగుమతులు పెంచుకుంటామన్నారు. భారత్, ఇండోనేషియా, ఆఫ్రికా వంటి దేశాలు పవర్ సెంటర్లుగా ఎదుగుతున్నాయని అభిప్రాయపడ్డారు. రష్యా నుంచి అమెరికా ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నప్పుడు.. భారత్ చేస్తే తప్పేంటని అగ్రరాజ్య ద్వంద్వ వైఖరిని ప్రశ్నించారు. ఉక్రెయిన్ విషయంలో ట్రంప్ శాంతి ఒప్పందానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని పుతిన్ తెలిపారు. కానీ, ఆయన చొరవలో రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలు కూడా ఉన్నాయని వ్యాఖ్యానించారు. భారత్ రష్యా బంధం ఇతర దేశాలకు హాని పెట్టే దిశగా ఎప్పుడూ సాగలేదని తేల్చి చెప్పారు.

## ఇండిగో సేవల్లో అంతరాయం.. 550 సర్వీసులు రద్దు

దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థల్లో ఒకటైన ‘ఇండిగో’ సేవల్లో మూడో రోజూ తీవ్ర అంతరాయం కొనసాగుతోంది. గురువారం 550 దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దయ్యాయి. దీంతో వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన పౌరవిమానయాన శాఖ, డీజీసీఏలు.. ఇండిగో అధికారులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ పరిస్థితులను సమీక్షిస్తున్నట్లు తెలిసింది. ఇండిగో నిత్యం దాదాపు 2300 విమాన సర్వీసులను నడుపుతోంది. సమయపాలనను తమ ప్రధాన




లక్షణమని ప్రకటించుకునే ఇండిగో.. గత మూడు రోజుల్లో దాని నిర్వహణ భారీ స్థాయిలో పడిపోయింది. వివిధ ఎయిర్‌పోర్టుల్లో కలిపి మొత్తంగా 550 విమాన సర్వీసులు రద్దైనట్లు సంబంధిత వర్గాల అంచనా. దిల్లీ ఎయిర్‌పోర్టులో 172, ముంబయిలో 118, బెంగళూరులో 100, హైదరాబాద్‌లో 75, కోల్‌కతాలో 35, చెన్నైలో 26, గోవాలో 11 విమానాలు రద్దైనట్లు తెలిసింది. ఇండిగో సర్వీసులు రద్దు గణనీయంగా పెరుగుతోందని, నిత్యం దాదాపు 170-200 రద్దవుతున్నట్లు జీడీసీఏ వెల్లడించింది. తాజా పరిణామాలపై సంస్థ సీఈవో పీటర్ ఎల్బర్స్ స్పందిస్తూ.. ప్రస్తుతం తమ ముందున్న ప్రధాన లక్ష్యం కార్యకలాపాలను సాధారణ స్థాయికి తీసుకురావడమేనని అన్నారు. తద్వారా సర్వీసుల సమయాన్ని పూర్వ స్థితికి తీసుకొస్తామన్నారు. అయితే, ఇది అంత సులభమైన పని కాదని అభిప్రాయపడ్డారు. సాంకేతిక సమస్యలు, షెడ్యూల్‌లో మార్పులు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, డీజీసీఏ నిర్దేశించిన కొత్త నియమాల వంటివి అందుకు కారణమన్నారు.

## సుష్మా స్వరాజ్ భర్త కన్నుమూత

మిజోరం మాజీ గవర్నర్, భాజపా దివంగత నేత సుష్మా స్వరాజ్ భర్త స్వరాజ్ కౌశల్ (73) కన్నుమూశారు. అనారోగ్య కారణాలతో ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుమార్తె బన్సూరీ స్వరాజ్ వెల్లడించారు. 1952 జులై 12న హిమాచల్ ప్రదేశ్‌లోని సోలన్‌లో జన్మించిన స్వరాజ్ కౌశల్.. 37 ఏళ్ల వయసులోనే (1990లో) మిజోరం గవర్నర్‌గా నియమితులయ్యారు. ఆయన భార్య సుష్మా స్వరాజ్.. దిల్లీ ముఖ్యమంత్రిగా, భారత విదేశాంగమంత్రిగా సేవలందించారు. 2019 ఆగస్టు 6న ఆమె మరణించారు.



## హైదరాబాద్ హౌస్‌లో పుతిన్‌కు ఆతిథ్యం.. అది ఎవరి నివాసమో తెలుసా..?

ఏడేళ్ల తర్వాత రష్యా అధ్యక్షుడు పుతిన్.. భారత్‌లో అడుగుపెట్టారు. ఈ చిరకాల మిత్రుడి రెండురోజుల పర్యటనలో భాగంగా చారిత్రాత్మక భవంతిలో ఆతిథ్యం స్వీకరించనున్నారు. అది దేశ రాజధాని దిల్లీలో భవనం కావడం విశేషం. దేశాధినేతలతో దౌత్య సంబంధాలకైనా, విదేశీ ప్రముఖులతో ఛాయ్‌పే చర్చలకైనా.. విలేకరుల సమావేశాలైనా, ముఖ్య కార్యక్రమాలైనా అన్నింటికీ అదొక తిరుగులేని వేదికగా మారింది. దాని పేరే హైదరాబాద్ హౌస్. దిల్లీలో ‘హైదరాబాద్’ వెనక ఎన్నో విశేషాలున్నాయి. నిజాం కలల సౌధంగా రూపుదిద్దుకున్న ఈ కట్టడం దేశ రాజధాని నగరంలో హైదరాబాద్ దర్పానికి ప్రతిబింబంగా నిలుస్తోంది. 1926లో ఈ హైదరాబాద్ హౌస్ నిర్మాణం ప్రారంభం కాగా.. 1928లో పూర్తయింది. హైదరాబాద్ చివరి నిజాం మిర్ ఉస్మాన్ అలీఖాన్ దీనిని ప్రారంభించారు. అప్పుడు దీనికి అయిన ఖర్చు రెండు లక్షల పౌండ్లు. అప్పుడు అధికారంలో ఉన్న బ్రిటిషర్లు దేశ రాజధానిని దిల్లీకి మార్చగా.. తన ఖ్యాతికి తగ్గట్టుగా అలీఖాన్ దీనిని నిర్మించుకున్నారు. ఆ సమయంలో అత్యంత ధనవంతుడిగా ఉన్న ఆయన తన స్థాయికి ఏమాత్రం తగ్గకుండా వైస్రాయ్ హౌస్ పక్కనే దీనిని ఏర్పాటు చేయాలని భావించగా.. బ్రిటిష్ ప్రభుత్వం అందుకు అంగీకరించలేదు. చివరకు వైస్రాయ్ హౌస్‌కు మూడు కిలోమీటర్ల దూరంలో హైదరాబాద్ హౌస్ నిర్మాణం చేపట్టారు.



**36 గదులు..విశాల ప్రాంగణాలు:**

దిల్లీలో తమ విడిది కోసం ఒక భవనం ఉండాలని భావించిన ఏడో నిజాం ఈ భారీ కట్టడానికి శ్రీకారం చుట్టాడు. అందుకోసం విదేశీ వాస్తు శిల్పి ఎడ్విన్ లుటియన్స్‌కు ఈ బాధ్యతలను అప్పగించాడు. యూరోపియన్ మొఘలుల శైలిని కలగలుపుతూ దీనిని నిర్మించారు. ఎత్తైన గుమ్మటం దీని ప్రధాన ఆకర్షణ. ఇది వైస్రాయ్ నుంచి తీసుకున్న డిజైన్. ఇక లుటియన్స్ సీతాకోకచిలుక ఆకారంలో, చూడగానే రాజసం ఉట్టిపడేలా నిజాం కలల సౌధాన్ని తీర్చిదిద్దారు. ఈ హౌస్‌లో 36 గదులు ఉంటాయి. విశాలమైన ప్రాంగణాలు, గంభీరంగా కనిపించే మెట్లమార్గాలు, ఫౌంటెయిన్లు ఆకట్టుకుంటాయి. ఈ ప్యాలెస్‌లో జెనానా ఏరియా కూడా ఉంది. అందులో 1215 గదులు ఉంటాయి. అది మహిళల కోసం ఉద్దేశించింది.

**నిజాం కుమారుల మెప్పు పొందలేక..**

విదేశీ ప్రముఖులకు ఎంతగానో నచ్చిన ఈ ప్యాలెస్‌ను నిజాం కేవలం నాలుగు సార్లు మాత్రమే సందర్శించాడు. సంప్రదాయ పద్ధతికి కాస్త భిన్నంగా, ఆధునిక యూరోపియన్ శైలిలో నిర్మించడంతో ఇందులో ఉండేందుకు నిజాం కుమారులు ఇష్టపడలేదు. ఇక, స్వాతంత్ర్యం అనంతరం ఇది హైదరాబాద్ హౌస్‌గా మారింది. మారుతున్న దౌత్య అవసరాలకు అనుగుణంగా ఇది కేంద్ర ప్రభుత్వ నియంత్రణలోకి వెళ్లిపోయింది. 1, అశోకా రోడ్‌లో ఉన్న ఈ ప్రఖ్యాత కట్టడం ప్రభుత్వ అతిథి గృహంగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. దిల్లీ నగరం నడిబొడ్డున దాదాపు ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ హైదరాబాద్ హౌస్ ఎందరో ప్రముఖులకు ఆహ్వానం పలికింది. అందులో అమెరికా మాజీ అధ్యక్షులు ఒబామా, ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, ఇజ్రాయెల్ నేత నెతన్యాహు ఉన్నారు. పుతిన్ గతంలో ఇక్కడ ఆతిథ్యం పొందారు కూడా.

## రష్యాతో 2 బిలియన్ డాలర్ల సబ్‌మెరైన్ డీల్?

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటన వేళ ఇరుదేశాల మధ్య పలు రక్షణ, వాణిజ్య ఒప్పందాలు కుదిరే అవకాశం ఉంది. ఈ క్రమంలో ఓ జలాంతర్గామి లీజుకు సంబంధించిన డీల్ కూడా ఖరారయ్యే అవకాశం ఉన్నట్లు పలు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దీని విలువ దాదాపు రెండు బిలియన్ డాలర్లని తెలుస్తోంది. ఈ జలాంతర్గామి కోసం దాదాపు పదేళ్లుగా చర్చలు జరుగుతున్నాయి. కానీ, ధర విషయంలో ఇన్నాళ్లు




సయోధ్య కుదరలేదు. పుతిన్ పర్యటన వేళ ఈ చర్చలు ఓ కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. రెండేళ్లలో రష్యా దాన్ని భారత్‌కు అందించనున్నట్లు సమాచారం. ఇటీవల భారత నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె త్రిపాఠి మాట్లాడుతూ.. త్వరలో ఓ అటాక్ సబ్‌మెరైన్ సేవల్లోకి రానున్నట్లు తెలిపారు. నావికాదళంలో ఇప్పటికే ఉన్న రెండింటి కంటే అది పెద్దదని తెలిపారు. అంతకు మించి వివరాలేమీ వెల్లడించలేదు.

## ‘అదనపు సిబ్బందిని తీసుకోండి’.. బీఎల్‌వోల ఆత్మహత్యల వేళ ‘సుప్రీం’ సూచన

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ కొనసాగుతున్న రాష్ట్రాల్లో బూత్ స్థాయి అధికారులు తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. పలువురు బీఎల్‌వోలు అనారోగ్యానికి గురి కావడం, రాజీనామాలు చేస్తుండటం, పలువురు ఆత్మహత్యకు పాల్పడుతున్న ఘటనలు కలవరపెడుతున్నాయి. ఈ నేపథ్యంలో సంబంధిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సుప్రీం కోర్టు కీలక సూచనలు చేసింది. బీఎల్‌వోల పని గంటలను తగ్గించేందుకు అదనపు సిబ్బందిని నియమించే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని చెప్పింది. నిర్ణీత సమయంలో విధులు నిర్వర్తించనందుకుగానూ బీఎల్‌వోలపై బలవంతపు చర్యలు తీసుకోవద్దంటూ ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ నటుడు



విజయ్‌కు చెందిన టీవీకే పార్టీ సుప్రీం కోర్టు ను ఆశ్రయించింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. తీవ్ర పని ఒత్తిడి కారణంగా అనేక మంది బీఎల్‌వోలు మరణించారని, విధులు నిర్వర్తించడంలో విఫలమైతే వారిపై కేసులు కూడా నమోదు చేస్తున్నారని టీవీకే తరపు న్యాయవాది వాదించారు. ఈ నేపథ్యంలో కొన్ని సూచనలు జారీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీఎల్‌వోలపై పని ఒత్తిడిని తగ్గించేందుకు అదనపు సిబ్బందిని నియమించడాన్ని రాష్ట్రాలు పరిగణించొచ్చని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ‘‘బీఎల్‌వోలు పనిభారం, ఇతర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లయితే.. రాష్ట్ర ప్రభుత్వం పరిష్కార చర్యలు తీసుకోవచ్చు. వారి పని గంటలు తగ్గించేందుకు అదనపు సిబ్బందిని తీసుకోవడాన్ని పరిగణనలోకి తీసుకోవచ్చు. ఎస్ఐఆర్ విధుల నుంచి తమను మినహాయించాలని ఎవరైనా కోరితే.. అటువంటి కేసులను విడివిడిగా పరిశీలించి, వారి స్థానంలో మరొకరిని భర్తీ చేయొచ్చు. ఎస్ఐఆర్ కోసం అవసరమైన సిబ్బందిని కేటాయించాల్సిన బాధ్యత సంబంధిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలపై ఉంది. అవసరమైతే వారి సంఖ్య పెంచొచ్చు’’ అని సుప్రీం కోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది. పశ్చిమ బెంగాల్, తమిళనాడు సహా 12 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రస్తుతం ‘ఎస్ఐఆర్’ ప్రక్రియ కొనసాగుతోంది. దాదాపు 5.32 లక్షల మంది బూత్ స్థాయి అధికారులు ఈ ప్రక్రియలో పాల్గొంటున్నారు. ఈ క్రమంలో బీఎల్‌వోలు తీవ్ర సవాళ్లు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, మమతా బెనర్జీ సహా పలు విపక్ష పార్టీల నేతలు ఈసీ తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. బూత్ స్థాయి అధికారులపై పని ఒత్తిడి తీవ్రంగా ఉంటోందని, అందుకే అనారోగ్యం బారినపడుతున్నారని ఆరోపిస్తున్నారు.

## హెచ్-1బీ వీసాదారులకు ‘వెట్టింగ్’ కష్టాలు.. ఆ సెట్టింగ్‌ను ‘పబ్లిక్’లో ఉంచాల్సిందే..!




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరినుంచి హెచ్ 1బీ వీసా జారీపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. కొన్ని నెలల క్రితం హెచ్ 1బీ వీసా ఫీజు లక్ష డాలర్లకు పెంచిన ట్రంప్ యంత్రాంగం.. తాజాగా వెట్టింగ్ నిబంధనలు మరింత కఠినతరం చేసింది. ఆ వీసాలకు దరఖాస్తు చేసుకునే వారి లింక్డిన్ పేజీలు, రెజ్యూమోలను సమీక్షించాలని దౌత్యవేత్తలకు అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ఆదేశాలు ఇచ్చింది. వాక్ స్వాతంత్ర్యం అణచివేసేలా సెన్సార్‌షిప్‌ను అమలు చేసేందుకు గతంలో పనిచేసినట్లు తేలినా వారి వీసాలను తిరస్కరించవచ్చని స్టేట్ డిపార్ట్‌మెంట్ జారీ చేసిన మెమో వెల్లడి చేస్తోంది. డిసెంబర్ 2న అన్ని అమెరికా దౌత్య కార్యాలయాలకు వెట్టింగ్ ఆదేశాలు వెళ్లాయి. వాటి ప్రకారం.. హెచ్ 1బీతోపాటు హెచ్ 4 వీసాదారుల రెజ్యూమో, లింక్డిన్ ప్రొఫైళ్లను సమీక్షించాలి. వారు అసత్య ప్రచారం, కంటెంట్ నియంత్రణ, ఫ్యాక్ట్ చెకింగ్, ఆన్‌లైన్ సేఫ్టీ వంటి విభాగాల్లో పని చేశారా..? అని గమనిస్తారు. డిసెంబర్ 15 నుంచి ఈ సమీక్ష జరగనుంది. విద్యార్థులు, ఎక్స్ఛేంజ్ విజిటర్లపైనా ఈ పరిశీలన ఉండనుంది. ఈ వీసాలకు దరఖాస్తు చేసుకున్నవారు తమ సోషల్ మీడియా ఖాతాల ప్రైవసీ సెట్టింగ్‌లను పబ్లిక్ చేయాలని యూఎస్ యంత్రాంగం ఆదేశించింది.

## స్వల్ప లాభాలతో గట్టెక్కిన స్టాక్ మార్కెట్..!



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం స్వల్ప లాభాల్లో ముగిశాయి. పొద్దంతా ఒడిదుడుకులను ఎదుర్కొన్న మార్కెట్లు చివరలో కొనుగోళ్లతో లాభాల్లోకి దూసుకెళ్లాయి. గ్లోబల్ మార్కెట్‌లో మిశ్రమ సంకేతాలు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, రికార్డు స్థాయిలో రూపాయి పతనం నేపథ్యంలో దేశీయ మార్కెట్లు ఉదయం నష్టాల్లో మొదలయ్యాయి. కొద్దిసేపటి తర్వాత మార్కెట్లు లాభాల్లోకి దూసుకెళ్లగా.. అమ్మకాలతో ఒత్తిడికి గురయ్యాయి. చివరి సెషన్‌లో కొనుగోళ్లతో స్వల్ప లాభాలతో గట్టెక్కాయి.

ఇంట్రాడేలో 84,949.98 పాయింట్ల కనిష్టాన్ని తాకిన సెన్సెక్స్.. గరిష్టంగా 85,487.21 పాయింట్లకు పెరిగింది. చివరకు 158.51 పాయింట్లు పెరిగి.. 85,265.32 వద్ద ముగిసింది. నిఫ్టీ 47.75 పాయింట్లు పెరిగి 26,033.75 వద్ద స్థిరపడింది. దాదాపు 1,716 షేర్లు లాభపడగా.. మరో 2,237 షేర్లు నష్టపోయాయి. నిఫ్టీలో అత్యధికంగా టీసీఎస్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సురెన్స్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, భారతీ ఎయిర్‌టెల్, సన్ ఫార్మా, భారత్ ఎలక్ట్రికల్, ట్రెంట్, ఐటీసీ, బజాజ్ ఫైనాన్స్ లాభపడగా.. మారుతి సుజుకీ, ఎటర్నల్, కొటక్ మహీంద్రా, కొటక్ మహీంద్రా, టైటాన్ కంపెనీ, ఐసీఐసీ బ్యాంక్, ఎస్‌బీఐ, టాటా స్టీల్ నష్టాల్లో ముగిశాయి.

## సిబ్బంది కొరతతో విమాన ప్రయాణాల్లో జాప్యం..

ఇండిగోకు డీజీసీఏ సమన్లు



**న్యూఢిల్లీ:** దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థ ఇండిగో సంక్షోభంలో చిక్కుకుంది. విమాన సేవల్లో తీవ్ర అంతరాయం నెలకొన్న విషయం తెలిసిందే. సిబ్బంది కొరత, సాంకేతిక సమస్యలు, ఎయిర్‌పోర్టుల్లో రద్దీ వంటి కారణాలు విమానాల రద్దుకు దారితీస్తున్నాయి. ఢిల్లీ, ముంబై, హైదరాబాద్ సహా దేశంలోని ఇతర పట్టణాలకు విమాన సర్వీసులు నిలిచిపోయాయి. ఫలితంగా వేలాది మంది ప్రయాణికులు ఎయిర్‌పోర్టుల్లో తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ ఇండిగో అధికారులకు సమన్లు జారీ చేసింది. దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థగా పేరున్న ఇండిగో కార్యాచరణ సమస్యలపై దర్యాప్తు చేసేందుకు సమన్లు ఇచ్చింది.

కాగా, గత రెండు రోజుల వ్యవధిలోనే 250 నుంచి 300 విమానాలను ఇండిగో రద్దు చేసింది. ఇవాళ కూడా పెద్ద సంఖ్యలో విమానాలు రద్దయ్యాయి. ఢిల్లీ ఎయిర్‌పోర్టులో 30 విమానాలు రద్దయ్యాయి. ఇక కోల్‌కతాలో నాలుగు విమానాలను సంస్థ రద్దు చేయగా.. సుమారు 24 విమాన రాకపోకలు ఆలస్యం అయ్యాయి. వీటిలో రెండు అంతర్జాతీయ విమానాలు కూడా ఉన్నాయి. బుధవారం దాదాపు 100కిపైగా ఇండిగో విమానాలు రద్దయ్యాయి. మరికొన్ని ఆలస్యంగా నడిచాయి. ఢిల్లీలో 38, బెంగళూరులో 42, ముంబైలో 33, హైదరాబాద్‌లో 19 విమానాలు రద్దయ్యాయి. మొత్తంగా గత నెల అంటే నవంబర్‌లో ఏకంగా 1,232 సర్వీసులను రద్దు చేసినట్లు డీజీసీఏ బుధవారం ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా, ఇండిగో ప్రతిరోజూ 2200 విమానాలను నడుపుతున్నది.

## రూపాయి పతనం...

యూఏఈ నుంచి వెల్లువెత్తున్న నగదు!

యూఏఈ నుంచి భారత్‌కు మూడింతలు పెరిగిన రెమిటెన్స్‌లు

దిర్హామ్‌తో పోలిస్తే రూపాయి విలువ పడిపోవడమే కారణం

ఇదే అదనుగా స్వదేశానికి భారీగా డబ్బు పంపుతున్న ప్రవాసులు



**న్యూఢిల్లీ:** గల్ఫ్ దేశం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) నుంచి భారత్‌కు నగదు ప్రవాహం భారీగా పెరిగింది. భారత రూపాయి విలువ పతనం కావడంతో, అక్కడ నివసిస్తున్న ప్రవాస భారతీయులు స్వదేశానికి పంపే డబ్బు (రెమిటెన్స్‌లు) ఏకంగా మూడింతలు పెరిగినట్లు 'ఖలీజ్ టైమ్స్' తన కథనంలో వెల్లడించింది. ప్రస్తుతం ఒక యూఏఈ దిర్హామ్‌కు 24.5 భారత రూపాయల మారకం విలువ లభిస్తుండటంతో, ఇదే సరైన సమయమని భావించి ఎన్నారైలు పెద్ద మొత్తంలో డబ్బు పంపుతున్నారు.

యూఏఈ కరెన్సీ అయిన దిర్హామ్‌ను రూపాయితో మార్చుకున్నప్పుడు గతంలో కంటే ఎక్కువ మొత్తం చేతికి వస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నామని అక్కడి భారతీయులు చెబుతున్నారు. షార్జాలో నివసించే ఆరిఫ్ ఖాన్ అనే వ్యక్తి మాట్లాడుతూ, తాను సాధారణంగా ప్రతినెలా 1,200 నుంచి 1,500 దిర్హామ్‌లు పంపేవాడినని, కానీ రూపాయి పతనం కారణంగా ఈసారి 4,500 దిర్హామ్‌లు పంపినట్లు తెలిపారు. దుబాయ్‌లో ఉండే ఆంథోనీ వర్గీస్ అనే మరో ప్రవాసుడు మాట్లాడుతూ, ఇది తమకు ముందుగానే వచ్చిన క్రిస్మస్ బహుమతి అని అభివర్ణించారు. "సాధారణంగా 2,000 దిర్హామ్‌లు పంపే నేను, ఈసారి 3,000 పంపాను. ఈ అదనపు డబ్బు ఇండియాలోని మా కుటుంబానికి స్కూల్ ఫీజులు, ఇతర ఖర్చులకు ఉపయోగపడుతుంది" అని ఆయన వివరించారు.

ఇదిలాఉండగా, అంతర్జాతీయ మార్కెట్‌లో అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ రికార్డు కనిష్ఠానికి పడిపోయింది. విదేశీ పెట్టుబడులు వెనక్కి వెళ్లడం, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి వంటి కారణాలతో రూపాయి బలహీనపడుతోంది. గురువారం నాటి ట్రేడింగ్‌లో ఒక దశలో రూపాయి విలువ 28 పైసలు క్షీణించి 90.43 వద్ద సరికొత్త జీవనకాల కనిష్ఠానికి చేరింది. ఈ పతనం మరికొంత కాలం కొనసాగవచ్చని, రూపాయి విలువ 91 మార్కును కూడా తాకే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

## కోహ్లీ, రోహిత్‌ల
# జోలికి రావొద్దు..



రవిశాస్త్రి వార్నింగ్!

విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలతో ఆడుకోవద్దని రవిశాస్త్రి హెచ్చరిక

వారిద్దరూ వన్డే ఫార్మాట్‌లో దిగ్గజాలని కితాబు

కోహ్లీ, రోహిత్‌లు ఫామ్‌లోకి వస్తే చాలామంది కనుమరుగవుతారని కామెంట్

సెలక్టర్లు, టీమ్ మేనేజ్‌మెంట్‌ను ఉద్దేశించే శాస్త్రి ఈ వ్యాఖ్యలు చేశారంటున్న విశ్లేషకులు

**న్యూఢిల్లీ:** టీమిండియా సీనియర్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల భవిష్యత్తుపై జరుగుతున్న చర్చపై భారత మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వారి కెరీర్‌తో ఆడుకోవాలని చూస్తున్నారంటూ కొందరికి గట్టి హెచ్చరికలు జారీ చేశారు. వన్డే ఫార్మాట్‌లో దిగ్గజాలైన కోహ్లీ, రోహిత్‌ల విషయంలో అనవసరంగా తలదూర్చవద్దని ఆయన స్పష్టం చేశారు.

ఇటీవల ఓ ఇంటర్వ్యూలో రవిశాస్త్రి మాట్లాడుతూ... "విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వన్డేల్లో దిగ్గజాలు. అలాంటి స్థాయి ఉన్న ఆటగాళ్లతో మీరు ఆడుకోవద్దు" అని అన్నారు. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ ఇద్దరి స్థానంపై వస్తున్న విమర్శల నేపథ్యంలో శాస్త్రి వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. టెస్టులు, టీ20 క్రికెట్ నుంచి ఇప్పటికే వారు రిటైర్ అయిన నేపథ్యంలో వారి ఫిట్‌నెస్‌పై చర్చ జరుగుతోంది.

ఈ ఇబ్బందులు సృష్టిస్తోంది ఎవరని ప్రశ్నించగా, "కొంతమంది చేస్తున్నారు. నేను చెప్పేది అంతే. ఒకవేళ ఆ ఇద్దరి మైండ్ సెట్ కుదురుకుని, సరైన బటన్ నొక్కితే, చుట్టూ ఉన్నవాళ్లంతా కనుమరుగైపోతారు" అని ప్రభాత్ ఖబర్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో శాస్త్రి ఘాటుగా సమాధానమిచ్చారు. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ, టీమ్ మేనేజ్‌మెంట్‌ను ఉద్దేశించే శాస్త్రి పరోక్షంగా ఈ హెచ్చరికలు చేసినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

మ్యాచ్ ప్రాక్టీస్ లేకపోవడం వల్ల 2027 ప్రపంచకప్‌కు వారి ఎంపిక కష్టమవుతుందని విమర్శలు వస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దేశవాళీ వన్డే టోర్నీ అయిన విజయ్ హజారే ట్రోఫీలో ఆడాలని బీసీసీఐ సూచించగా, రోహిత్ అంగీకరించాడు. మొదట విముఖత చూపిన కోహ్లీ కూడా సెలక్టర్ల ఒత్తిడితో ఆడేందుకు ఒప్పుకున్నాడు.

## ఆ ఇద్దరి చేతుల్లో రో-కో భవితవ్యం..

ఇంతకంటే అన్యాయం ఉండదేమో..!



**న్యూఢిల్లీ:** సీనియర్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు తమ విలువేంటో బ్యాట్‌తోనే చెబుతున్నారు. వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్న రో-కో.. తమ క్లాస్ ఆటకు తిరుగులేదని చాటుతూ జట్టుకు భారీ స్కోర్లు అందిస్తున్నారు. కోహ్లీ వరుసగా ఒక ఫిఫ్టీ, రెండు సెంచరీలతో .. రోహిత్ ఒక శతకం, ఫిఫ్టీతో ఫామ్ చాటుకున్నా.. సరే వన్డే ప్రపంచకప్ బెర్తుపై మాత్రం సందిగ్ధం కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో భారత మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. క్రికెట్‌లో ఏమీ సాధించిన వ్యక్తుల చేతుల్లో కోహ్లీ, హిట్‌మ్యాన్ భవిష్యత్ ఉండడం అత్యంత బాధాకరమని అన్నాడు ఒకప్పటి ఆఫ్ స్పిన్నర్.

ప్రస్తుతం భారత క్రికెట్‌లో అంతర్గత విభేదాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. సీనియర్లు కోహ్లీ, రోహిత్‌కు హెడ్‌కోచ్ గౌతం గంభీర్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌కు ఏమాత్రం పొసగడం లేదనేది వాస్తవం. దిగ్గజ ఆటగాళ్లైన రో-కో మైదానంలో అదరగొడుతున్నా.. వీరికి వరల్డ్‌కప్‌లో అవకాశం ఉంటుందా? లేదా? అనేది తెలియడం లేదు. అయితే.. మాజీ క్రికెటర్లు మాత్రం విరాట్, రోహిత్‌కు మద్దతుగా నిలుస్తున్నారు. ఏ విషయాన్నైనా ముక్కుసూటిగా చెప్పే.. మాజీ ఆఫ్ స్పిన్నర్ హర్భజన్ భారత మేనేజ్‌మెంట్‌పై తీవ్రమైన వ్యాఖ్యలు చేశాడు. వరల్డ్ క్లాస్ బ్యాటర్లైన విరాట్, హిట్‌మ్యాన్ భవితవ్యం ఏమంత పెద్ద ఘనతలు సాధించిన గౌతీ, అగార్కర్ చేతుల్లో ఉండడం దారుణమని భజ్జీ విమర్శలు గుప్పించాడు.

'రో-కో భవితవ్యంపై నేను ఏమీ మాట్లాడదలుకోలేదు. ఎందుకంటే.. ఒక క్రికెటర్‌గా నేను ఇప్పుడు చూస్తున్నవి నా విషయంలోనూ జరిగాయి. నేను ఒక్కడినే కాదు చాలామంది ఆటగాళ్లు ఇబ్బందిపడ్డారు. టాలెంట్ ఉన్నా, నిలకడగా రాణిస్తున్నా చాలా జరగడం దురదృష్టకరం. మనం వీటి గురించి అస్సలు మాట్లాడం. చర్చ కూడా చేయం. అవును.. ఇప్పుడు కోహ్లీ, రోహిత్ భవిష్యత్తు కూడా క్రికెటర్‌గా ఏమంత గొప్ప ఘనతలు సాధించని వారి చేతుల్లో ఉంది. రో -కో ఇద్దరూ ఎల్లప్పుడూ పరుగులు సాధిస్తుంటారు. వీరిద్దరూ భారత గొప్ప క్రికెటర్లు. రోజురోజుకు మరింత ధ్రుఢంగా మారుతున్నారిద్దరు. ఛాంపియన్ ప్లేయర్లు అయిన కోహ్లీ, హిట్‌మ్యాన్ యువతరానికి ఆదర్శంగా నిలుస్తున్నారు' అని హర్భజన్ తెలిపాడు.

### కోహ్లీ- రోహిత్ భవిష్యత్తును
## నిర్ణయించేది మీరా..

హర్భజన్ సంచలన వ్యాఖ్యలు!



**న్యూఢిల్లీ:** టీమిండియా స్టార్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ భవిష్యత్తును.. తమ కెరీర్లో పెద్దగా ఏం సాధించలేని వారు నిర్ణయించడం దురదృష్టకరమని మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ అన్నారు.

వారు ఇప్పటికే టీ20, టెస్ట్ ఫార్మాట్‌కు గుడ్ బై చెప్పారు.. ప్రస్తుతం ఇద్దరు వన్డే క్రికెట్‌లో మాత్రమే ఆడుతున్నారు.. వన్డే ప్రపంచ కప్ 2027లో పాల్గొనడమే టార్గెట్ గా ముందుకు కొనసాగుతున్నారు. అయితే, వారు వరల్డ్ కప్ ఆడబోయే టీమ్‌లో ఉంటారా.. అనే విషయంలో సందిగ్ధత నెలకొంది.

అయితే, ఈ అంశంపై హర్భజన్ సింగ్ మాట్లాడుతూ.. స్వయంగా నేను ఆటగాడిని కాబట్టి సమాధానం చెప్పడం లేదు.. నా విషయంలోనూ ఇలాగే జరిగింది. నా సహచరుల్లో చాలా మందికి ఇలాగే జరిగింది. అయినా మేం దాని గురించి మాట్లాడం, చర్చ కూడా జరపమని తెలిపారు. విరాట్ కోహ్లీ ఇప్పటికీ అద్భుతంగా ఆడుతున్నాడు.. ఈ విషయంలో సంతోషంగా ఉన్నా.. అయితే, తమ కెరీర్లో పెద్దగా సాధించని వ్యక్తులు కూడా.. రోహిత్, విరాట్ భవిష్యత్తును నిర్ణయించడం దురదృష్టకరం అని హర్భజన్ సింగ్ విమర్శించారు.

ఇక, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఎప్పటికీ గొప్ప ఆటగాళ్లే.. వారు టీం కోసం బ్యాటర్లుగా, కెప్టెన్స్ గా ఎంతో చేశారని హర్భజన్ సింగ్ అన్నారు. వాళ్లు రోజు రోజుకు తమ ఆటలో ఇంకా మెరుగవుతూ.. యువ క్రికెటర్లకు కూడా ఆదర్శంగా నిలుస్తున్నారు.. ఈ విషయంలో వారి ఇద్దరికి నా అభినందనలు తెలియజేస్తున్నాని చెప్పారు. అలాగే, పిచ్‌ల గురించి కూడా అతడు (గంభీర్) మాట్లాడాడు.. గత 10, 12 ఏళ్లుగా బౌలర్లకు సహకరించే.. ముఖ్యంగా స్పిన్ పిచ్‌లను సిద్ధం చేస్తున్నారు. ఇలాంటి పిచ్‌ల మీద స్పిన్నర్లు కొత్త బంతితో బౌలింగ్ చేస్తున్నారు.. ఈ పద్ధతి పూర్తిగా మారాలి.. టెస్ట్ క్రికెట్ అంటే ఐదు రోజుల ఆట.. దాన్ని ఎందుకు రెండున్నర, 3 రోజుల్లోపే ముగిస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటి యువ క్రికెటర్లకు క్రీజులో ఒక రోజు మొత్తం ఉండే ఓపిక ఉండటం లేదన్నారు. టెస్ట్ క్రికెట్ ఇలాగే కొనసాగితే.. రాబోయే రోజుల్లో ఈ ఫార్మాట్ కనుమరుగైపోతుందని హర్భజన్ సింగ్ ఆందోళన వ్యక్తంచేశాడు.

# నిప్పులు చెరిగిన స్టార్క్..

రికార్డు శతకం బాదేసిన రూట్..!

**బ్రిస్బేన్:** యాషెస్ సిరీస్ తొలి మ్యాచ్‌లో చిత్తుగా ఓడిన ఇంగ్లండ్ గబ్బా టెస్టులో తడబడి నిలబడింది. జో రూట్ (135 నాటౌట్) సూపర్ సెంచరీతో జట్టును ఆదుకోగా ఆలౌట్ ప్రమాదం తప్పించుకుంది. ఆసీస్ పేసర్ మిచెల్ స్టార్క్(6-71) నిప్పులు చెరిగినా.. క్రీజులో పాతుకుపోయిన రూట్ టెయిలెండర్లతో పోరాడి జట్టు స్కోర్ మూడొందలు దాటించాడు. జోఫ్రా ఆర్చర్(32 నాటౌట్)తో కలిసి పదో వికెట్‌కు రూట్ 61 రన్స్ జోడించాడు. ఫలితంగా మొదటి రోజు ఆట ముగిసే సరికి ఇంగ్లండ్ 325 పరుగులు చేసి పరువు కాపాడుకుంది.

బ్రిస్బేన్‌లోని గబ్బా మైదానంలో జరుగుతున్న పింక్‌బాల్ టెస్టులోనూ ఇంగ్లండ్ తొలి రోజే షాక్ తగిలింది. పెర్త్‌లో పది వికెట్లు తీసి.. బెన్ స్టోక్స్ బృందాన్ని కుప్పకూల్చిన మిచెల్ స్టార్క్(6-761) మరోసారి పర్యాటక జట్టును దెబ్బకొట్టాడు. టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకున్న ఇంగ్లండ్‌కు ఆరంభంలోనే పెద్ద షాకిస్తూ ఓపెనర్ బెన్ డకెట్(0), ఓలీ పోప్(0)లను ఔట్ చేశాడు స్టార్క్. స్టార్క్ విజృంభణతో 5 పరుగులకే 2 వికెట్లు పడిన అనంతరం క్రీజులోకి వచ్చిన జో రూట్(135 నాటౌట్ 202 బంతుల్లో 15 ఫోర్లు, ఒక సిక్సర్‌తో)తో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. మరో ఓపెనర్ జాక్ క్రాలే(76)తో కలిసి స్కోర్‌బోర్డును నడిపించిన రూట్.. 181 బంతుల్లో కంగారూ గడ్డపై మొదటి శతకం సాధించాడు. ఈ ఫార్మాట్‌లో రూట్‌కిది 40వ సెంచరీ కావడం విశేషం.





264 పరుగులకే 9 వికెట్లు

క్రాలే, రూట్ ద్వయాన్ని నెసర్ విడదీసి ఇంగ్లండ్‌ను కష్టాల్లో పడేశాడు. ఆ తర్వాత వచ్చిన హ్యారీ బ్రూక్(31)ను పెవిలియన్ పంపిన స్టార్క్.. డేంజరస్ జేమీ స్మిత్(0), విల్ జాక్స్(19), గస్ అట్కిన్సన్(4), బ్రైడన్ కార్సే(0)లను ఔట్ చేసి ఇంగ్లండ్‌ను ఆలౌట్ అంచున నిలిపాడు. 264 పరుగులకే 9 వికెట్లు పడినా రూట్ మాత్రం పట్టువదల్లేదు. చివరి బ్యాటరైన జోఫ్రా ఆర్చర్(32 నాటౌట్) సహకారంతో జట్టు స్కోర్ 300 దాటించాడు. వికెట్ కాపాడుకుంటూ చక్కని షాట్లు ఆడిన ఆర్చర్, రూట్ హాఫ్ సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పారు. దాంతో.. తొలిరోజు ఆట ముగిసే సరికి ఇంగ్లండ్ 9 వికెట్ల నష్టానికి 325 రన్స్ చేసింది. గబ్బాలో ఐదో వికెట్ తీశాక పాక్ దిగ్గజం వసీం అక్రమ్ రికార్డు బ్రేక్ చేశాడు స్టార్క్. టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన లెఫ్ట్ ఆర్మ్ పేసర్‌గా చరిత్రకెక్కాడు ఆసీస్ స్పీడ్‌స్టర్.




# చిత్ర పరిశ్రమలో ఒడుదొడుకులు సహజం

## నటి రకుల్ ప్రీత్ సింగ్ వ్యాఖ్య

**టాకీస్:** చిత్రపరిశ్రమలో ఒడుదొడుకులు సహజమని నటి రకుల్ ప్రీత్ సింగ్ అన్నారు. సినిమా అన్నాక విజయాలు, అపజయాలు..నష్టాలు, లాభాలు కూడా సహజమని అన్నారు. తన భర్త జాకీ భగ్నానీ దివాలా తీశారంటూ ఇటీవల వచ్చిన వార్తలపై ఆమె స్పందించారు. కంపెనీ మూసివేశారనే వార్తలను ఖండించారు. ఆ సమయంలో మీడియాలో వచ్చిన రూమర్స్ గురించి ప్రస్తావించారు. క్లిక్స్ కోసం ఏమైనా రాసే సంస్కృతికి అలవాటు పడ్డారు. వాస్తవానికి, ఆ వార్తలకు చాలా వ్యత్యాసం ఉంటుంది. నాకు నిజానిజాలు అన్నీ తెలుసు కాబట్టి నేను వాటిని పట్టించు కోలేదు. పరిశ్రమలో భాగమైనప్పుడు కొన్ని విషయాల గురించి మౌనంగా ఉండడమే మంచిది. సమయం వచ్చేవరకూ ప్రజలకు అసలు నిజమేమిటనేది తెలియదు. జాకీ భగ్నానీపై వార్తలు వచ్చినప్పుడు అతడు ఎన్ని సవాళ్లు ఎదుర్కొన్నాడో నేను దగ్గర నుంచి చూశాను. కంపెనీ మూసేశారని రాశారు. అతడు నిర్మాతగా వ్యవహరించిన మూడు సినిమాలు ఆదరణ సొంతం చేసుకోలేదన్నమాట వాస్తవమే. కానీ, కంపెనీ మూసివేయ లేదు. ఆర్థికంగా చాలా నష్టపోయాం. ఇండస్ట్రీలోని ప్రతి నిర్మాతకు అలా జరుగుతుంది. ఒకనొక సమయంలో అమితాబ్‌బచ్చన్‌కు కూడా ఇలానే జరిగింది. ఎదుగుతున్న సమయంలో ఇదంతా ఒక దశ అని రకుల్ అన్నారు. బాలీవుడ్ నటులు అక్షయ్‌కుమార్, టైగర్ ష్రాఫ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బడే మియా.. ఛోటే మియా'. భారీ తారాగణంతో రూపొందిన ఈ సినిమా అనుకున్న స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయింది. దీంతో ఈ సినిమా నిర్మాత, రకుల్ ప్రీత్ సింగ్ భర్త జాకీ భగ్నానీ దివాలా తీశారంటూ గతంలో వార్తలు వచ్చాయి.

MOVIE TIME

# డెస్టినేషన్ వెడ్డింగ్

## పెళ్లి ఎప్పుడో ఇప్పుడే చెప్పలేనన్న క్యూట్ రష్మిక



**టాకీస్:** టాలీవుడ్ క్యూట్ కపుల్ విజయ్ దేవరకొండ -రష్మిక మందన్న వివాహంపై గత కొన్ని రోజులుగ వాడి వేడి చర్చ నడుస్తోంది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో రాజస్థాన్‌లోని ఉదయపూర్ ప్యాలెస్‌లో వీరి పెళ్లి జరగనుందని ప్రచారం జోరుగా సాగుతోంది. ఇటీవలే రష్మిక అక్కడి ఏర్పాట్లను పర్యవేక్షించిందన్న సమాచారం బయటకు రావడంతో ఈ రూమర్స్ మరింత వేగం పుంజుకున్నాయి. అయితే ఇప్పటి వరకు ఈ వార్తలపై ఇద్దరు నటుల తరఫున ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ నేపథ్యంలో ఓ హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో రష్మిక తన వివాహ వార్తలపై మొదటిసారి స్పందించింది. రూమర్స్‌ను ఖండించలేనని, ప్రస్తుతం మాత్రం ఏ విషయాన్నీ ధ్రువీకరించలేనని చెప్పింది. తన పెళ్లి గురించి ఎప్పుడు మాట్లాడాలో, వివరాలు ఎప్పుడు షేర్ చేసుకోవాలో అనే విషయం తనకే తెలుసని, సరైన సమయానికి అందరితో పంచుకుంటానని రష్మిక స్పష్టం చేసింది. ఇప్పుడే ఏ వివరాలూ చెప్పలేనని రష్మిక చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. విజయ్?రష్మికలు ఇప్పటి వరకు ఎంగేజ్మెంట్ ఫోటో కాని, అధికారిక అనౌన్స్‌మెంట్ చేయకపోవడంతో, ఇద్దరూ ప్రత్యేకంగా ఏదో ప్లాన్ చేస్తున్నారన్న చర్చ నడుస్తోంది. ఎప్పుడు అధికారిక సమాచారం వస్తుందోనని నెటిజన్స్ ఆసక్తిగా చూస్తున్నారు. గీత గోవిందంతో హిట్ కాంబినేషన్‌గా నిలిచిన విజయ్-రష్మిక, ఆ తర్వాత డియర్ కామ్రేడ్‌లో కూడా అదే కెమిస్ట్రీని కొనసాగించారు. ప్రస్తుతం రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో మరో సినిమాకు జోడీగా నటించనున్నట్టు వార్తలు వస్తున్నాయి., రీల్ లైఫ్ కపుల్‌గా ప్రారంభమైన వారి బంధం ఇప్పుడు రియల్ లైఫ్ వరకూ వెళ్తోందన్న ఊహాగానాలు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. మరి దీనిపై ఎప్పుడు క్లారిటీ ఇస్తారనేది చూడాలి. ఇక రష్మిక కెరియర్ ఇప్పుడు ఫుల్ స్వింగ్‌లో ఉంది. తెలుగు, తమిళం, హిందీ భాషలలో సినిమాలు చేస్తూ సూపర్ హిట్స్ అందుకుంటుంది. నేషనల్ క్రష్ కాస్త ఇప్పుడు వరల్డ్ క్రష్‌గా మారుతుంది అంటూ ఆమె అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు.

# ప్రముఖ నిర్మాత శరవణన్ మృతి

## నివాళి అర్పించిన పలువురు ప్రముఖులు



టాకీస్: ప్రముఖ కోలీవుడ్ నిర్మాత, ఏవీఎం నిర్మాణ సంస్థ అధినేత ఏవీఎం శరవణన్ (85) కన్నుమూశారు. చెన్నైలోని ఆయన నివాసంలో గురువారం ఉదయం తుదిశ్వాస విడిచారు. తమిళ్, తెలుగు, మలయాళం, హిందీ భాషల్లో శరవణన్ పలు హిట్ చిత్రాలను నిర్మించి గుర్తింపుతెచ్చుకున్నారు. ఏవీఎం బ్యానర్‌పై మొత్తం 300 సినిమాలకు పైగా నిర్మించారు. తెలుగులో 'సంసారం ఒక చదరంగం', 'ఆ ఒక్కటీ అడక్కు', 'మెరుపు కలలు', 'జెమిని', 'శివాజీ' వంటి సినిమాలను అందించారు. శరవణన్ మృతితో చిత్ర పరిశ్రమలో విషాదం నెలకొంది. ప్రముఖులు ఆయనకు నివాళులర్పిస్తున్నారు. ఏవీఎం నిర్మాణ సంస్థ అధినేత శరవణన్ భౌతిక కాయానికి నివాళులర్పిస్తూ నటుడు సూర్య భావోద్వేగానికి గురయ్యారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ కంటతడి పెట్టుకున్నారు. తమిళనాడు సీఎం స్టాలిన్, రజనీకాంత్, సూర్య తండ్రి శివకుమార్ తదితరులు నిర్మాత భౌతిక కాయానికి నివాళులర్పించారు. సూర్య నటించిన 'పెరళగన్' (సుందరాంగుడు), 'వీడొక్కడే' తదితర చిత్రాలు ఏవీఎం ప్రొడక్షన్స్‌లోనే తెరకెక్కాయి. శరవణన్ మృతి పట్ల పలువురు సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా సంతాపం ప్రకటించారు. శరవణన్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# మనశంకరవరప్రసాద్ నుంచి మరో పాట

## 8న విడుదలకు చిత్రబృందం సన్నాహాలు

**టాకీస్:** అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'మన శంకరవర ప్రసాద్' చిత్రం నుంచి తాజాగా రెండో పాట విడుదల తేదీ ఖరారైంది. ఇప్పటికే విడుదలైన మొదటి పాట 'మీసాల పిల్ల' భారీ విజయాన్ని సాధించి ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తున్న నేపథ్యంలో చిత్ర బృందం తదుపరి పాట అప్‌డేట్‌తో అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోంది. 'శశిరేఖ' అనే పేరుతో రాబోతున్న ఈ రెండో పాట డిసెంబర్ 8న విడుదల కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ పాటకు సంబంధించిన ప్రోమో డిసెంబర్ 6న విడుదల చేయనున్నట్లు తెలిపింది. ఈ సినిమాకు అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తుండగా.. మెగాస్టార్ చిరంజీవితో పాటు విక్టరీ వెంకటేశ్, నయనతార, కేథరిన్ థ్రెసా వంటి అగ్ర తారలు నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని సాహు గారపాటి, సుష్మిత కొణిదెల, వి. హరికృష్ణ  సంయుక్తంగా నిర్మిస్తున్నారు.



# నేను సానుభూతి కోరుకోవడం లేదు

## రాజ్ నిడిమోరు మాజీ భార్య శ్యామలి



**టాకీస్:** తాను ఎవరి సానుభూతి కోసం పాకులాడటం లేదని దర్శకుడు రాజ్ నిడిమోరు మాజీ భార్య శ్యామాలి ఇన్‌స్టా వేదికగా పోస్ట్ పెట్టారు. తాను ఎవరికీ ఇంటర్వ్యూలు ఇవ్వనని పేర్కొన్నారు. తన నుంచి బ్రేకింగ్ న్యూస్‌లు, ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూలు ఆశించవద్దని అన్నారు. సమంత - రాజ్ నిడిమోరు వివాహం చేసుకున్న తర్వాత అందరూ తనపై జాలి చూపిస్తున్నారని.. కానీ, తాను ఏ విషయాన్ని పట్టించుకోవడం లేదన్నారు. నాపై ప్రేమాభిమానాలు చూపుతున్న అందరికీ కృతజ్ఞతలు. మీ అందరి ఆశీర్వాదాలు నాకు అందుతున్నాయి. కానీ, నేను ప్రస్తుతం ఎలాంటి విషయాల గురించి పట్టించుకునే పరిస్థితుల్లో లేను. ఎందుకంటే మా గురువు క్యాన్సర్ బారిన పడినట్లు ఇటీవల తెలిసింది. నేను ఆయన కోసం ప్రార్థిస్తున్నాను. నాకు ఎలాంటి పీఆర్ టీమ్ లేదు. నా సోషల్ మీడియా ఖాతాలను నేనే నిర్వహిస్తాను. నేను మా గురువు గురించి ఆలోచిస్తూ నిద్ర లేని రాత్రులు గడుపుతున్నా. ఆ కారణంగా మీ అందరికీ స్పందించలేను. నా బాధను అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా. నా నుంచి ఎలాంటి బ్రేకింగ్ న్యూస్‌లు ఆశించకండి. మీడియా వారు నాపై సానుభూతి చూపాల్సిన అవసరం లేదు.

## బాహుబలి కోసం

# జపాన్‌కు ప్రభాస్

## స్పిరిట్ షూట్‌కు తాత్కాలిక బ్రేక్



టాకీస్: గ్లోబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటిస్తున్నాడు. ముందుగా ప్రకటించిన ప్రకారం జపాన్‌లో బాహుబలి : ది ఎపిక్ స్పెషల్ ప్రీమియర్‌కు హాజరు కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ప్రభాస్ గురువారం జపాన్‌కు వెళ్లాడు. ఈవెంట్‌కు బాహుబలి ఫ్రాంచైజీ నిర్మాత శోభు యార్లగడ్డ కూడా హాజరు కానున్నారు. బాహుబలి : ది ఎపిక్ జపాన్‌లో డిసెంబర్ 12న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ మేరకు మేకర్స్ డిసెంబర్ 5, 6వ తేదీల్లో స్పెషల్ ప్రీమియర్స్ ఏర్పాటు చేశారు. ప్రభాస్ కల్కి 2898 ఏడీ ప్రమోషన్స్ టైంలో జపాన్‌లో తాను కలవలేకపోయిన అభిమానులను కలుస్తానని హామీనిచ్చాడని తెలిసిందే. వారికిచ్చిన మాట ప్రకారం జపాన్‌లో అభిమానులతో చిట్‌చాట్ చేయనున్నాడు. ఇదిలా ఉంటే యానిమల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా ఇప్పటికే షూటింగ్ మొదలు పెట్టిన విషయం తెలిసిందే. ప్రభాస్, తృప్తి డిమ్రిపై వచ్చే కొన్ని సన్నివేశాలను కూడా ఇటీవలే షూట్ చేశారు. షూటింగ్ నుంచి చిన్న బ్రేక్ తీసుకున్న ప్రభాస్ జపాన్ టూర్ అయిపోగానే మళ్లీ స్పిరిట్ షూట్‌తో బిజీగా కానున్నాడు. టాలీవుడ్ డైరెక్టర్ మారుతి-ప్రభాస్ కాంబోలో రాజాసాబ్ వస్తుందని తెలిసిందే. హార్రర్ కామెడీ జోనర్‌లో వస్తోన్న ఈ చిత్రాన్ని సంక్రాంతి కానుకగా 2026 జనవరి 9న విడుదల చేయనున్నారు. ఇప్పటికే ప్రమోషన్స్‌లో భాగంగా లాంచ్ చేసిన పోస్టర్లు, టీజర్లు, ట్రైలర్స్‌కు మంచి స్పందన వస్తోంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025  RNI.No. APTEL/2009/29786.